# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :45 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 15-04-2025 | పేజీలు:4 వెల: 2.00


### దేశ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర చిరస్మరణీయం

అమరావతి,భారత రాజ్యాంగ నిర్మాత బీ ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి మంత్రులు నివాళి అర్పించారు. రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాళులు అర్పించారు. భారత దేశ అగ్రగణ్య మేధావుల్లో బీఆర్ అంబేద్కర్ ఒకరని స్మరించుకున్నారు. ఆధునిక భారత దేశ నిర్మాణంలో ఆయనది చాలా కీలక పాత్ర అని గుర్తుచేసుకున్నారు. దేశంలోని పౌరులందరికీ సమానత్వం, గౌరవం కల్పించాలని పరితపించారని అన్నారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతం పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్ అని తెలిపారు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా గళమెత్తిన ఉద్యమకారుడని చెప్పారు. మహిళలు, కార్మికుల హక్కుల సాధన కోసం ముందుండి నడిచిన నేత అంబేద్కర్ అని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలు, ఆదర్శాలు నేటికి కూడా ఎంతో ఆచరణీయమని ప్రశంసించారు. రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి నివాళి అర్పించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, హక్కుల సాధనకు అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.


## ఎస్సీ వర్గీకరణ అమలు.. తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ..




హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.దాదాపు మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం జరుగుతున్న ఉద్యమానికి ఇది ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం, మొత్తం 56 ఎస్సీ కులాలను మూడు విభాగాలుగా వర్గీకరించింది. మూడు గ్రూపులుగా విభజన, రిజర్వేషన్ల కేటాయింపు వివరాలు ఇలా ఉన్నాయి.గ్రూప్-A లో అత్యంత వెనుకబడిన కులాలకు 1 శాతం రిజర్వేషన్, గ్రూప్-B లో మధ్యస్థ లబ్దిదారులకు 9 శాతం రిజర్వేషన్, గ్రూప్-Cలో మెరుగైన స్థితిలో ఉన్న కులాలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఈ విధంగా మొత్తం 15 శాతం రిజర్వేషన్లను వర్గీకరించిన రూపంలోనే కొనసాగించనున్నారు. ఈ వర్గీకరణ సామాజిక న్యాయానికి, సమతా స్థాపనకు దోహదపడుతుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం సాగిన పోరాటానికి నేడు తీర్పు లభించింది. ఇది బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగడంలో ముఖ్యమైన అడుగు" అని అన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో పేదలకు మెరుగైన అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం చురుకుగా పనిచేస్తుందని తెలిపారు.అలాగే, ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజాహిత పథకాలపై ఆయన వివరించారు. యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. రైతులు, రైతు కూలీలకు ఎకరాకు రూ.12 వేలు ఆర్థిక భరోసాగా అందిస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవ ప్రతీకగా "ఇందిరమ్మ ఇళ్లు" పథకాన్ని ప్రారంభించామని, భూమిపై హక్కుల కోసం "భూభారతి" పథకానికి శ్రీకారం చుట్టామని వివరించారు. ఈ నిర్ణయాలు తెలంగాణలోని ఎస్సీ వర్గాలకు సామాజిక, ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రగతిపథంలో ముందడుగు వేయడం అని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

## వక్ఫ్ రూల్స్‌ను కాంగ్రెస్ తమ స్వార్థానికి మార్చేసింది: మోదీ

న్యూఢిల్లీ,అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ పవిత్రమైన రాజ్యాంగాన్ని ఆయుధంలా వాడుకుంటోందని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న నిరసనలపై ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో వక్ఫ్ రూల్స్‌ను తమ స్వార్థానికి మార్చేసిందని ఆరోపించారు. అధికారం కోసం పవిత్రమైన రాజ్యాంగాన్ని ఆయుధంలా వాడుకుంటూ.. ఓటు బ్యాంకు వైరస్‌ను వ్యాప్తి చేసిందని అన్నారు. ముస్లింలకు మద్దతుగా నిరసనలు చేపడుతున్న కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఎందుకు వారికి పార్టీలో ఉన్నత స్థానాలను ఇవ్వలేదని ప్రశ్నించారు. ముస్లిం అభ్యర్థులకు 50 శాతం ఎన్నికల టిక్కెట్లను ఎందుకు రిజర్వ్ చేయలేదని నిలదీశారు.హరియాణాలోని హిస్సార్ విమానాశ్రయ ప్రారంభోత్సవంలో ప్రధాని మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ఈ విమానాశ్రయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్‌ను గుర్తుచేసుకుంటూ.. ఆయన పాటించిన విధానాలే తమ ప్రభుత్వానికి స్ఫూర్తినిస్తున్నాయన్నారు. కానీ.. దేశ ప్రజల కోసం ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అధికారం పొందేందుకు ఒక సాధనంగా వాడుకుంటోందని విమర్శించారు. ఇందిరాగాంధీ హయాంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అధికారాన్ని నిలుపుకోవడానికి రాజ్యాంగ స్ఫూర్తిని హత్య చేశారని దుయ్యబట్టారు. రాజ్యాంగ విలువల గురించి ప్రసంగాలు చేసే ప్రతిపక్ష నాయకులు ఎప్పుడూ వాటిని పాటించలేదని అన్నారు. పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం, 2025 ఇటీవల అమల్లోకి వచ్చింది. కాగా



కేంద్రం తీసుకొచ్చిన కొత్త వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై విపక్ష పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మొత్తం 15 పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై సర్వోన్నత న్యాయస్థానం ఏప్రిల్ 16న విచారణ జరపనుంది. మరోవైపు వక్ఫ్ సవరణల చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ఇది 14, 25, 26 ఆర్టికల్స్‌ను పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో ముస్లింలు దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్నారు. పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన ఆందోళనల్లో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితులు అదుపుతప్పడంతో 110 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## అంబేద్కర్ అభయహస్తం అమలు చేసేదెప్పుడు?..

హైదరాబాద్: కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (కేటీఆర్) అన్నారు. ఆధునిక భారతావనికి పునాదులు వేశారని తెలిపారు. బాబాసాహెబ్ ఆలోచన, ముందు చూపు చాలా గొప్పదని. దేశంలో అందరూ బాగుండాలన్నదే అంబేద్కర్ ఆలోచన అని చెప్పారు. అంబేద్కర్ ఆలోచనను కేసీఆర్ ఆచరణలో పెట్టడం. దళితబంధు లాంటి అమలు చేసిన దమ్మున్న నాయకుడు కేసీఆర్ అన్నారు. అబద్ధపు ప్రచారంతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని, దళితులకు అంబేద్కర్ అభయహస్తం ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. రూ.12 లక్షలు కాదు.. 12 రూపాయలు కూడా ఇవ్వరని. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రముఖ ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్.. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు అంబేద్కర్ ఆలోచనలే కారణమన్నారు. ప్రజాస్వామ్యంలో మందబలంతో అవతలివారి గొంతు నొక్కేయడం ఉండకూడదని అందరితో కొట్లాడి కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు ఉన్న రాష్ట్రం అనుమతి ఉండాల్సిన అవసరం ఉంది. లేదనిరీ రాజ్యాంగంలో ఆర్టికల్ 3ని పొందుపర్చారు. మనం ఇప్పుడు తెలంగాణలో మాట్లాడుతున్నామంటే దానికి కారకుడు ఒకేఒక్కరు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని చెప్పారు. బాబాసాహెబ్ ఆలోచన, ముందు చూపు చాలా గొప్పదన్నారు.అంబేద్కర్‌ను కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమని, దళిత బిడ్డ కాబట్టి దళిత జాతికి మాత్రమే నాయకుడు అన్నట్టుగా ఆయనను తక్కువ చేసే ప్రయత్నం చేస్తారు. స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, వారితోపాటు కొట్లాడిన వేలాది లక్షలాది మంది ఎలాగైతే కీలకపాత్ర పోషించారో, స్వాతంత్ర్యంతరం ఆధునిక భారతావనికి అంబేద్కర్ పునాది వేసిన అద్భుతమైన నాయకుడు అంబేద్కర్. దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు చిన్న చిన్న రాష్ట్రాలు ఉండేవి. ఎన్ని భాషలు, మతాలు, కులాలు, ఉపకులాలు, సంస్కృతులు ఉండేవి. నలుగురు కలిసిఉండటం కష్టం. ఇన్ని వైవిధ్యాలున్న ఈ దేశాన్ని శాశ్వతంగా సుదీర్ఘ కాలం కలిసిఉండాలంటే ఏం చేయాలని అంబేద్కర్, డాక్టర్ ఫజల్ అలీ వంటి మేధావులు ఆలోచించి భాష ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకు ఆలోచన చేశారు. ఆ సమయంలోనే ఒక రాష్ట్రంలో ఒక భాష ఉండాలనేది మంచి ఆలోచన, కానీ కచ్చితంగా ఒక భాషకు ఒక రాష్ట్రం ఉండాలనేది తప్పు. ఒక భాషకు నాలుగైదు రాష్ట్రాలు ఉండొచ్చు. పరిపాలనా సౌలభ్యం చిన్న రాష్ట్రాలు ఉంటే తప్పులేదని ఆలోచన చేసిన నాయకుడు బాబాసాహెబ్ అంబేద్కర్. నాటు అంబేద్కర్ నాయకత్వంలో రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలనే మనం పాటిస్తున్నాం. 78 ఏండ్ల తర్వాత కూడా రాజ్యాంగమే మనలను కాపాడుతోంది. దేశంలో



అందరూ బాగుండాలన్నదే అంబేద్కర్ ఆలోచన అన్నారు.అంబేద్కర్ నమ్మిన సిద్ధాంతం బోధించు, సమీకరించు, పోరాడు అనే తత్వాన్ని అర్థం చేసుకుని, ఆచరణలో పెట్టిందే కేసీఆర్. పార్టీ పెట్టిన మొదటి రోజు నుంచి లక్షల సంఖ్యలో ప్రజలను సమీకరిస్తూ, వారికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను బోధిస్తూ, వివరిస్తూ, తెలంగాణకు అన్యాయం జరిగితే పోరాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యం ఆధారంగా రాష్ట్రాన్ని సాధించిన మహానాయకుడు కేసీఆర్. అలా సాధించుకున్న రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా కార్యక్రమాలు జరిగాయి.అంబేద్కర్‌ను అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదువుకోవడానికి బరోడా మహారాజ్ ఆశీర్వదించి పంపారు. బరోడా మహారాజ్ ఒక అంబేద్కర్‌కు దీవెన ఇచ్చారు. కానీ మన ప్రభుత్వంలో వేలాది మంది పిల్లలను అమెరికా పంపించాం, లక్షలాది మంది పిల్లలను పటిష్టమైన పునాదివేశాం. 1022 పాఠశాలలు పెట్టి, ఒక్కో విద్యార్థిపై నెలకు రూ.10 వేలు, సంవత్సరానికి లక్షా 25 వేలు ఖర్చుపెట్టి ప్రపంచంతో పోటీ పడేలా తయారుచేసి అంబేద్కర్ ఆలోచనను కేసీఆర్ ఆచరణలో పెట్టిన నాయకుడు కేసీఆర్. గురుకులాలు మాత్రమే కాదు, పదేండ్ల కాలంలో 7 వేల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఇచ్చి విదేశీ విద్య అభ్యసించడానికి తెలంగాణ నుంచి పంపించాం. అప్పుడుఅప్పుడు రాజకీయాల్లో ఓడుతాం.. గెలుస్తాం. అవన్నీ ఒక విషయం కాదు. కానీ కేసీఆర్ లాంటి సాహసి, స్వాప్నికుడు, దమ్మున్న నాయుడు మాత్రమే దళితబంధులాంటి ఆలోచన చేయగలుగుతాడు. రాజకీయాలు ఆలోచించి లాభనష్టాలు బేరీజు వేసుకుని ఇస్తే సీట్లు వస్తాయా, ఇయ్యకపోతే సీట్లు వస్తయా అని ఆలోచించేటోనికి అర్థంకూడా కాదు. ఎందుకంటే ఒక రైతుబంధు పెట్టాలన్నా ఖలేజా ఉండాలి. దళితబందు పెట్టాలన్నా, పేదవాడికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పాలన్నా దమ్ముండాలి. ఆ దమ్మున్న నాయకుడే కేసీఆరే.వెయ్యి మైళ్ల ప్రయాణం కూడా ఒక్క అడుగుతోనే మొదలైతది.

## అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచిందే కాంగ్రెస్ పార్టీ



హైదరాబాద్ : అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ హత్య చేసిందని.. తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు ఘోరి కట్టారని తెలిపారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి . అంబేద్కర్ జయంతి సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమలో అంబేద్కర్ చిత్రపటానికి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపి లక్ష్మ ణ్ లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై మాటలతో విరుచుకు పడ్డారు. సామాజిక న్యాయం కోసం అంకిత భావంతో పని చేస్తున్నామని, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన రాజ్యాంగం చెక్కు చెదరలేదని.. అది అంబేద్కర్, దేశ ప్రజలు గొప్పతనం అని ప్రసంగించారు.అలాగే 75 సంవత్సరాలుగా రాజ్యాంగానికి తూట్లు పొడవాలని కాంగ్రెస్ చూసిందని, అంబేద్కర్ ను ఓడించేందుకు అయనకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన నికృష్టమైన మనస్తత్వం కాంగ్రెస్ పార్టీది అని విరుచుకపడ్డారు.అయన చనిపోతే అయన పార్థివ దేహం తరలించిన విమానం ఛార్జ్ లను కూడా ఆయన భార్య దగ్గర వసూలు చేసిన దుర్మార్గమైన పార్టీ కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. ఎవరెవరికో భారత రత్న ఇచ్చుకున్నారు.. అంబేద్కర్ కు మాత్రం ఇవ్వలేదు.. చివరకు బీజేపీ చొరవతో ఆయనకు భారత రత్న వచ్చిందని ఆయన చెప్పుకొచ్చారు.నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక అంబేద్కర్ తో అనుబంధం, సంబంధం ఉన్న ప్రాంతాలను అద్భుతంగా తీర్చిదిద్దారని, పంచ తీర్థగా అభివృద్ధి చేశారని తెలిపారు. అంబేద్కర్ ను మతం మార్చుకోవాలని ఎంత ఒత్తిడి చేసిన అయన ఆ మతం లోకి మారలేదని ఆయన అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ను ముంబై లో పెట్టబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు

భారత రత్నతో గౌరవించింది బీజేపీ సర్కార్ : బండి సంజయ్

అంబేద్కర్ జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమని కేంద్ర హెూంశాఖ సహాయ బండి సంజయ్ కుమార్ అన్నారు. ఒక్కపూట తింటూ ఉన్నత చదువు కోసం తన పదేళ్ల జీవితాన్ని బరోడా మహారాజ్ వద్ద పణంగా పెట్టి చదువు గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేసిన మహెూన్నతుడు అని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంబేద్కర్‌కు భారతరత్న అవార్డుతో గౌరవమిచ్చిందని గుర్తు చేశారు. పార్లమెంట్?లో అంబేద్కర్ చిత్రపటం, సుప్రీంకోర్టు, న్యాయ మంత్రిత్వ శాఖలో విగ్రహాల ఏర్పాటు చేసిన ఘనత బీజేపీదేని చెప్పారు.

అడుగడుగునా అవమానించింది కాంగ్రెస్!

అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించిందే కాంగ్రెస్ అని ఆరోపించారు. ఆయనపై కుట్ర చేసి రెండు సార్లు ఓడించింది కూడా కాంగ్రెస్ అని మండిపడ్డారు. ఆయనకు భారతరత్న ఇవ్వకుండా అవమానించడమే కాకుండా ఆయనను ఓడించిన వ్యక్తికి పద్మభూషణ్ ప్రధానం చేసింది కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. అలాంటి పార్టీ నేడు అంబేద్కర్ జయంతిని పండుగలా నిర్వహించాలనడం సిగ్గుచేటని, తక్షణమే బడుగు, బలహీనవర్గాల ప్రజలందరికీ కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ లో రిజర్వేషన్ల విధానాన్ని వ్యతిరేకించిన పార్టీ కూడా కాంగ్రెస్ అని గుర్తు చేశారు.


## అసమానతలు లేని సమాజ నిర్మాణమే అంబేద్కర్ కు ఘనమైన నివాళి

హైదరాబాద్ : భారత జాతిని ఏకతాటిపై నిలిపేందుకు గొప్ప రాజ్యాంగాన్ని అందించిన ప్రపంచ మేధావి, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జీవితం ప్రతీ ఒక్కరికీ ఆదర్శమని, ఆయన స్వప్నించిన సమ సమాజ నిర్మాణం కోసం అందరం కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. సింగరేణి భవన్ లో సోమవారం జరిగిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా మాట్లాడారు.స్వతంత్ర భారతదేశ ప్రగతికి అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దిశా నిర్దేశం చేసిందన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల వల్లే ప్రతీ ఒక్కరికీ స్వేచ్ఛా, సమానత్వం, సమాన అవకాశాలు లభించాయన్నారు. కార్మికులకు, మహిళలకు హక్కులను కల్పించిన ఆయన అన్ని వర్గాలకు సంబంధించిన వ్యక్తి అని కొనియాడారు. ప్రపంచంలోనే ప్రభావశీల వ్యక్తుల్లో అంబేద్కర్ అగ్రగణ్యుడు అని కొనియాడారు. అంబేద్కర్ చెప్పినట్లుగానే విద్య ద్వారానే అవకాశాలను దక్కించుకోగలుగుతామని, ప్రతీ ఒక్కరు చదువుకు ప్రాధాన్యం ఇవ్వాల న్నారు.



కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం.సుభానీ అధ్యక్షత వహించి ప్రసగించారు. ఎస్సీ, ఎస్టీ అసోషియేషన్ ప్రతినిధి బోడ భద్రు మాట్లాడారు. కార్యక్రమంలో సింగరేణి భవన్ అధికారులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గోశాలలో ఆవుల మృతి.. అసత్య ప్రచారంతో టీటీడీ ప్రతిష్టను దెబ్బ తీయొద్దు..



తిరుపతి: తిరుపతి ఎస్వీ గోశాలలో ఆవుల మృతిపై టీటీడీ ఈఓ శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ బోర్డు మాజీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి భక్తుల మనోభావాలు దెబ్బ తీసేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.మూడు నెలల్లో వంద ఆవులు చనిపోయాయని తెలిపారు.. అసత్యాలు ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టను దెబ్బ తీసేలా వ్యవహరించారు.. సగటున నెలకు 15 ఆవులు చనిపోతాయి.. గడచిన మూడు నెలల్లో కేవలం 43 ఆవులు చనిపోయాయని ఆయన తేల్చి చెప్పారు. ఇక, దాతల నుంచి తీసుకున్న ఆవుల్లో కొన్ని అనారోగ్యంతో చనిపోయాయి.. మృతి చెందిన ఆవులకు పోస్టుమార్టం చేయ లేదనడం అవాస్తవం.. జూన్ 2024లో ఈఓగా బాధ్యతలు తీసుకొనే ముందు ముఖ్యమంత్రిని కలిశాను.. టీటీడీలో వ్యవస్థలు పాడయ్యాయి వాటిని సరి చేయాలని చెప్పారని శ్యామలరావు పేర్కొన్నారు.ఇక, 10 నెలల్లో ఎన్నో ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా మౌలిక వసతులు మెరుగుపరిచాం.. టీటీడీ ఐటీ విభాగంలో ఉన్నతస్థాయి అధికారి నియామకంలో నిబంధన గాలికి వదిలారు.. జీఎం స్థాయి అధికారిని నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డారు.. ఐటీ విభాగంలో అక్రమాలు భారీగా జరిగాయి.. ఐటీ విభాగం వైఫల్యంతో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. దళారి ఒకరు 50 సార్లు ఆర్జిత సేవలు టికెట్ పొందారు.. అలాగే, నెయ్యి కొనుగోలులో అక్రమాలు జరిగాయి.. కల్తీ నెయ్యి సరఫరాను అరికట్టాం.. అన్న ప్రసాదంలో నాణ్యత లోపించింది.. గడచిన ఐదేళ్లలో వ్యవస్థలో ఎన్నో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఈవో శ్యామలరావు చెప్పుకొచ్చారు.అయితే, స్వామి వారికి ఆర్గానిక్ ప్రసాదాల పేరుతో పలు అక్రమాలు చేశారని శ్యామలరావు పేర్కొన్నారు. మూడు కోట్ల రూపాయల విలువైన సరుకులకు రూ.25 కోట్లు చెల్లించారు.. టీటీడీ గోశాల నిర్వహణలో ఎన్నో అక్రమాలు జరిగాయి.. మార్చి 2021 నుంచి మార్చి 2024 వరకు గోశాలలో భారీ అక్రమాలు చోటు చేసుకొన్నాయి.. గత ఐదేళ్లలో చనిపోయిన ఆవుల వివరాలు దాచి పెట్టారు.. ఆవులు లేని గోశాలకు దాణా పేరుతో నిధులు దుర్వినియోగం.. 2023లో విజిలెన్స్ అధికారులను గోశాలకు అనుమతించలేదు.. గోశాలలో అక్రమాలు బయట పెడతారనే భయంతో విజిలెన్స్ అధికారులను రానివ్వలేదు అని టీటీడీ ఈవో శ్యామలరావు ఆరోపించారు.

## ఆ పథకాలను కాంగ్రెస్ కొనసాగిస్తేనే అంబేద్కర్ కు నిజమైన నివాళి



హైదరాబాద్ : అనగారిన వర్గాలకు ఉపయోగపడే పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని.. అప్పుడే అంబేద్కర్ కు నిజమైన నివాళి అని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న అవార్డు గ్రహిత డా. భీమ్ రావు అంబేద్కర్ 134 వ జయంతి నేడు. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న రాజకీయ ప్రముకులు అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు. ఇందులో భాగంగా.. కేసీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నివాళులు అర్పిస్తూ.. ఓ ప్రకటనను విడుదల చేశారు.ఆ ప్రకటనలో.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ ఏర్పడిందని గుర్తు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ సాధ్యమైందన్నారు. అలాగే తెలంగాణ వచ్చిన తర్వాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బీఆర్ఎస్ పాలన కొనసాగించిందని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో దళిత బంధు, సహా అనేక పథకాలను అమలు చేశామని ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తు చేశారు.

## సంపాదకీయం

మంగళవారం 15-04-2025

# అంబేడ్కర్ ఆశయాలరకు తూట్లు !

అంబేద్కర్ ఆశయాలను పాటించడం.. ఆయన ప్రవచించిన సిద్ధాంతాలను అమలు చేయడం అన్నది పైకి కనిపిస్తున్న ముసుగు మాత్రమే. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య కాలంలో మన నాయకులంతా సమాజాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా కులాల కుంపట్లు రగిలిస్తున్నారు. ఇప్పుడు రాజకీయ పార్టీలకు, నాయకులకు ఆయన పేరును జపించడం నిత్యకృత్యం కావడం వెనక ఓటుబ్యాంక్ రాజకీయం తప్ప మరోటి లేదు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందాన అంబేడ్కర్ పేరు చెప్పుకుని అణగారిన వర్గాలను బుట్టలో వేసుకోవడం అన్న కళలో మన నాయకులు ఆరితేరారు. ఆయనకు భారీ విగ్రహాలు పెట్టి దండలు వేసి చేతులు దులుపు కుంటున్నారు. ఆయన ఆశయాలను తుంగలో తొక్కామన్న భావన రాకుండా నిత్యం అంబేడ్కర్ జపం చేస్తున్నారు. ఎంతో జాగ్రత్తగా అన్ని రాజకీయ పార్టీలు అణగారిన వర్గాల ఓట్లకోసం అంబేడ్కర్ పేరును వాడుకుంటున్నారు. నిజంగానే మనం అంబేడ్కర్ మహానుభావుడి ఆశయాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామా లేదా అన్నది నేతలతో పాటు దళితులు కూడా ఆలోచన చేయాలి. ఎన్ని దళిత వాదాలను పురుద్దరించారో.. ఎందరికి చదువు, ఉద్యోగాలు కల్పించారో ఆత్మవిమర్శ చేసుకోవాలి. అంబేడ్కర్ ఆశించిన ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లడంలో రాజకీయ పార్టీలు చేస్తున్న మోసాలు గుర్తించాలి. దళితులంతా ఒక్కటే అన్న పట్టుదలతో సాగితే రాజకీయాల్లో పట్టు సాధించగలమని దళితులు గుర్తించాలి. అంతరాలు లేని సమాజం నిర్మించేందుకు ప్రయత్నించిన దాఖలాలు లేవు. రాజకీయ నాయకులే కులాల కుంపట్లు సృష్టించి దేశంలో అసమానతలను పెంచి పోషిస్తున్నారు. దీంతో కులవ్యవస్థ మరింత బలంగా వేళ్లూనుకుని సమాజాన్ని అతలాకుతలం చేస్తోంది. దళిత జనోద్దరణలో అన్ని పార్టీలది ఒకటే విధానంగా ఉంది. నేటికీ దళితుల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు లేవు. వారిని ఓటుబ్యాంక్‌గా చూస్తున్నారు తప్ప తమలో ఒకరిగా చూడడం లేదు. దీనికితోడు దళితుల్లో ఉపకులాల ద్వారా వారి ఐక్యతను దెబ్బతీస్తున్నారు. అలాగే మాల, మాదిగ అంటూ దళితులే రోడ్డెక్కేలా చేస్తున్నారు. దీని ఆధారంగా ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నాల్లో ఉన్న ఆయా పార్టీల పన్నాగాలను దళితులు గుర్తించడం లేదు. ఏటా అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయన విగ్రహాలకు దండలేయడం...కొత్తగా విగ్రహాలు పెట్టడం వరకే ప్రభుత్వాలు బాధ్యత వహిస్తున్నాయి. భారీ విగ్రహాలను పెట్టి దళితజనోద్దరణ అంటూ కాలం గడిపేస్తున్నారు. నేతలు కూడా అంబేడ్కర్ విగ్రహాలను పెట్టాలన్న డిమాండ్ తీసుకుని వచ్చి వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ రకంగా వారిని ఎప్పటికప్పుడు మోసం చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప వారిని తోటి మానవులుగా రాజకీయ నాయకులు భావించడం లేదు. వారికి సమాజంలో గౌరవం దక్కేలా అభివృద్ది కార్యక్రమాలు చేపట్టడం లేదు. గ్రామాల్లో ప్రజలమధ్య వైషమ్యాలు లేకున్నా నాయకులు ఆలోచనలో అవి ఉన్నాయనడానికి మన నాయకుల తీరే నిదర్శనం. ప్రతి ఎన్నికల్లో అది బాగా కనిపిస్తోంది. ప్రధాని మోడీ అయితే అంబేడ్కర్ పేరు ఉచ్చరించ కుండా ఉండలేకపోతున్నారు. ఆయనకు మేమిచ్చిన గౌరవం మరెవరూ ఇవ్వలేదంటున్నారు. కానీ ఈనాడు నిత్యం అంబేడ్కర్ జపం చేస్తున్న వారంతా ఉన్నత కులాలు వారే. వారు ఏనాడు దళితులను ఉన్నతికి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నించడం లేదు. రాష్ట్రపతిని చేయడం దళిత ఉద్దరణ అనుకుంటారు. పాలనా పగ్గాలు వారి చేతుల్లో లేకుండా ఉత్సవ విగ్రహాలుగానే వారిని చూస్తున్నారు. దేశంలో పరిస్థితులు చూస్తుంటే అంబేడ్కర్, పూలేలు ఎదుర్కొన్న వర్ణవివక్ష, కులవివక్ష జాడ్యాలు ఇంకా సమసి పోయాయని చెప్పగలమా ? అంటే చెప్పలేం. ఇంతగా విద్య అందుబాటులోకి వచ్చినా ఇంకా వారు అణగారిన వర్గాలు గానే మిగిలిపోతున్నారు. ఒకటి రెండు పదవులు వారి మొహాన పడేసి దళితజన ఉద్దరణ జరిగిందన్న ప్రచారం చేసుకుంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే అవుతుంది. దళితబంధు, పెన్షన్లు వంటివి ఇచ్చి ఆహా.. ఓహో అంటూ కాలం గడుపు తున్నారు. దళిత ఉద్దరణ గురించి గొప్పగా చెప్పుకునే కాంగ్రెస్ జగ్జీవన్ రామ్‌కు ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చినా అడ్డుకున్న చరిత్రను మరచిపోలేం.. అందుకే దళితనేతను పాలనకు దగ్గరగా చేసిన చరిత్రను చూడడం లేదు. దళితులను సిఎం చేస్తానన్న కెసిఆర్ సైతం వారిని ఓటుబ్యాంక్ కోసం మభ్యపెట్టారు. తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ ఊదరగొట్టి తెలంగాణ సమాజాన్ని మోసం చేసి, పదేళ్ల పాటు ఆయనే సిఎంగా కొనసాగారు. దళితబంధు పేరుతో అక్రమాలకు తెరతీసారు. రాజకీయ నాయకులు ఎలాగూ మంచి చేయరు. కనీసం ప్రజలుగా మనమంతా ఆ మహనీయుడికి నివాళి అర్పించేందుకు ఆయన చూపిన మార్గంలో నడిచే ప్రయత్నం చేయాలి. అంటరాని కులాలు ఆర్థికంగా బలపడినదే, రాజకీయాధికారం పొందినదే వారి సమస్యకు సమగ్రమైన పరిష్కారం దొరకదని అంబేడ్కర్ ఆనాడే ప్రకటించారు. వారికి రాజ్యాధికారం వస్తే తప్ప ఈ అంటరానితనం, చిన్నచూపు చూడడం వేరుగా చూడడం వంటి సమస్యలు సమసిపోతాయని భావించారు. భారత జాతీయ కాంగ్రెస్ నడిపే జాతీయోద్యమంలో అంటరానితన నిర్మూలన కోసం గాంధీ కృషి చేస్తూ ఉంటే ఆ కృషికి కాంగ్రెస్ సభ్యులనుండి పూర్తిస్థాయిలో మద్దతు లభించలేదు. గాంధీజీ వర్ణ వ్యవస్థను భారత సమాజం ప్రత్యేక లక్షణమని, ఎవరి కుల వృత్తిని వారు అనుసరించడం వల్ల ఎటువంటి పోటీలేని ఆర్థిక వ్యవస్థ భారత సమాజంలో ఉన్నదని సమర్థించాడు. ఆనాడే అంబేడ్కర్‌ను ప్రధాని చేయాలన్న ఆలోచనకూడా గాంధీజీకి రాలేదు. ఇప్పటికైనా దళితులు ఐక్యత ప్రదర్శించాలి. అంబేడ్కర్ పేరుతో చేసే రాజకీయాలను దునుమాడాలి. ఎన్నికల్లో ఐక్యత చాటాలి. తమను రాజకీయంగా వాడుకుంటున్న నేతల నిజస్వరూపాలను గుర్తించాలి. అప్పుడే అంబేడ్కర్ మహాశయుడి ఆశయాలను సాధించగలం. కులరహిత సమాజం సాధించగలం.

# విదేశీ విద్యార్థులపై ట్రంప్ వీరంగం



సెంట్రల్ డెస్క్:వలసదారులు, విదేశీ విద్యార్థుల విషయంలో అగ్రరాజ్యం ఆంక్షలు మరీ మితిమీరుతున్నాయి. పేరుకు ప్రజాస్వామిక దేశమే అయినా, పెత్తందారీ పోకడలు పోతూ విదేశీయులను ముప్పుతిప్పలు పెడుతోంది. ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే అక్రమ వలసదారులపై విరుచుకుపడటం మొదలుపెట్టారు. తమ దేశానికి వచ్చి ఇక్కడే తిష్ఠ వేసుకుని కూర్చుని, ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నారనే ఆగ్రహంతో అక్రమ వలసదారుల్ని యుద్ధవిమానాల్లో ఆయా దేశాలకు తిప్పి పంపించిన ట్రంప్ మహాశయుడు అంతటితో ఆగలేదు. తమ యూనివర్శిటీల్లో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులను ఎలా క్షోభపెట్టాలా అనేది ఇప్పుడు ఆయన ఎజెండాలో ప్రధానంశమైంది. లేనిపోని ఆంక్షలు విధిస్తూ, విద్యార్థులను వెనక్కు పంపే బృహత్తర కార్యక్రమానికి ఆయన తెరతీశారు. సామాజిక మాధ్యమాల్లో యూదు వ్యతిరేక పోస్టులు పెట్టినా, వాటిని లైక్ చేసినా, షేర్ చేసినా తప్పేనంటోంది ఆయన ప్రభుత్వం. అంతేకాదు, వేగంగా వాహనం నడిపినా వీసా రద్దు చేస్తామంటూ మతిమాలిన ఆంక్షలు విధిస్తోంది. ఇప్పటికే విద్యార్థి వీసాల్లో కోత విధిస్తున్న అమెరికా ప్రభుత్వం, ఎలాగోలా వీసా సంపాదించి వివిధ యూనివర్శిటీల్లో చదువుకుంటున్న విద్యార్థులపైనా ప్రతాపం చూపిస్తూండటంతో పరిస్థితి గందరగోళంగా మారింది. విద్యార్థి వీసాల్లో అమెరికా కోత విధించడం బైడెన్ హయాంలోనే మొదలైనా, ట్రంప్ ఆ విధానాన్ని మరింత దూకుడుగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ఏడాది 40 శాతం వీసాలు తిరస్కరణకు గురి కాగా, ఈ ఏడాది ఆ సంఖ్య రెట్టింపునకు పైనే ఉంటుందని అంచనా. స్టూడెంట్ వీసాలు మొదలు గ్రీన్ కార్డు దరఖాస్తుదారుల వరకూ అందరిపైనా నిఘా పెడుతోంది. పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్, లెబనాన్ హెజ్బొల్లా, యెమెన్ హూతీల గ్రూపులను అమెరికా చాలాకాలం క్రితమే ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించింది. వీటికి మద్దతుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే యూదు వ్యతిరేక చర్యలుగా పరిగణించి, వీసాలు రద్దు చేస్తామంటోంది. ఉగ్రవాద గ్రూపులకు మద్దతు పలకడం నేరమే కావచ్చు, కానీ, అందుకు ఏకంగా వీసాలు రద్దు చేసి, విద్యార్థుల్ని స్వదేశాలకు తిప్పిపంపడం దారుణం. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను సామాజిక మాధ్యమాల్లో ఖండించిన పాపానికి కొందరు విద్యార్థుల వీసాలు రద్దు కావడం ట్రంప్ ప్రభుత్వం తెంపరితనానికి పరాకాష్ఠ. ఒక్క గత నెలలోనే అమెరికా ప్రభుత్వం 300 మందికి పైగా వీసాలను రద్దు చేయడం ఈ సందర్భంగా గమనార్హం. చూడబోతే, వీసాలను రద్దు చేసి, విదేశీ విద్యార్థులకు గేట్లు మూయడమెలా అనే అంశంపై ట్రంప్ మహాశయుడు పిహెచ్‌డి చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఏ దేశంలోనైనా వేగంగా వాహనం నడిపినా, ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినా చలాన్లతో సరిపెడతారు. కానీ, అగ్రరాజ్యాధినేత మాత్రం అలాంటివారి వీసాలను రద్దు చేస్తామంటున్నారు. కృత్రిమ మేధ సాయంతో విద్యార్థుల ఏరివేత కార్యక్రమాన్ని చేపట్టిన ప్రభుత్వం, సదరు విద్యార్థులు క్షమాపణ చెప్పినా, తమ పోస్టుల్ని సామాజిక మాధ్యమాల నుంచి ఉపసంహరించుకుంటున్నా కనికరించడం లేదు. ఫెడరల్ ఇమిగ్రేషన్ డేటాబేస్ చూసిన హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల అధికారులు దేశంలో ఏకపక్షంగా విదేశీ విద్యార్థుల వీసాల రద్దు జరుగుతోందని తెలిసి నిర్ఘాంతపోయారట. ట్రంప్ ప్రభుత్వం నియంతృత్వ పోకడలను గమనించిన హెచ్1బి వీసాదారులు సైతం పెట్టేబేడా సర్దుకుని స్వదేశాలకు పయనమయ్యే ఆలోచనలో పడ్డారంటే అందులో ఆశ్చర్యం ఏముంటుంది? వీరంతా అమెరికాను వీడితే, అక్కడి ఐటి రంగం కుదేలవడం ఖాయం. తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లని మొండిగా వాదించే ట్రంప్‌కు ఇవేవీ పట్టడంలేదు. దాంతో ఆయా కంపెనీలే రంగంలోకి దిగి విదేశీ ఉద్యోగుల్ని దేశం విడిచి వెళ్లొద్దంటూ బతిమాలుకుంటున్నట్లు వార్తలు వినవస్తున్నాయి. ఒకవేళ వారు స్వదేశానికి వెళ్తే, తిరిగి అమెరికాకు రానివ్వరేమోననే భయం కూడా ఇందుకు కారణం. భారత్ విషయానికొస్తే, సుంకాల బాదుడుతోపాటు విదేశీ విద్యార్థుల వీసాలపై వేటు కూడా ప్రధాన సమస్యగానే భావించాలి. అమెరికాకు వెళ్లే విద్యార్థుల సంఖ్యలో భారత్‌దే అగ్రస్థానం కాగా, అందులో అత్యధికులు తెలుగురాష్ట్రాలవారే. ఈ నేపథ్యంలో సుంకాలపై అగ్రరాజ్యంతో చర్చించేందుకు సమాయత్తమవుతున్న భారత ప్రభుత్వం వీసాలపై ఆంక్షల సడలింపును కూడా చర్చించాలి. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వంపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఒత్తిడి తేవాలి.

# అందరి చూపు.. భారత్ వైపు



న్యూఢిల్లీ,ట్రంప్ మొదటి పదవీకాలంలో ఉన్నంత సన్నిహితంగా నరేంద్ర మోడీ ట్రంప్‌తో వ్యవహరిస్తారా అన్నది చూడాలి. ఎందుకంటే ట్రంప్ దాదాపు డైరెక్టుగానే భారత దేశంతో అంత సన్నిహిత స్నేహసంబంధాలు లేవని పదేపదే అంటూ, మోడీకి ఖేదం కలిగిస్తున్నారు. ట్రంప్ భారతదేశం గురించి చెడుగా, కాస్త తక్కువచేసి మా ట్లాడడాన్ని భారతదేశంలోని ఉన్నత వర్గాలు, మీడియా, రాజకీయ వర్గాలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. దీనిపై వివరణ ఇచ్చేందుకు సిద్ధపడినవారూ ఉన్నారు. మోడీ వంటి ఆత్మాభిమానం గల, స్వీయంగా ఇమేజ్ గల నాయకుడు తనకు ఎదురైన అవమానాలపై లోలోన ఆగ్రహించి ఉండవచ్చు. అమెరికా భారతదేశం మధ్య చాలా ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిలుపుకోవాలని కూడా భారతదేశం కోరుకుంటోంది. అయితే జపాన్ కు చెందిన షిగేరు ఇషిబా, ఇటలీకి చెందిన జార్జియా మెలోని మాదిరిగా ట్రంప్ ముందు సాగిలపడాలని ఏ భారతీయ నాయకుడు అనుకోరు అన్నది సుస్పష్టం. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చిన్న వెనుకడుగు వేశారు. బాండ్ మార్కెట్లో జరిగిన పరిణామాలు ఆయన తన నిర్ణయం 90 రోజులపాటు వాయిదా వేసుకునేలా చేశాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సంఘటనలు ఊహించదగినవే. చైనాకు సంబంధించినంత వరకూ వ్యూహం ఎంతవరకూ స్థిరంగా ఉంటుందో చూడాలి. చైనా ప్రెసిడెంట్ జీ జిన్‌పింగ్ ఉద్దండుడు. ఎదురులేని నాయకుడు. మిగతా ప్రపంచ దేశాలకు కొంత ఊరట కల్పించిన ప్రెసిడెంట్ ట్రంప్ చైనాను ఆకట్టుకునేందుకు మారిన నిబంధనలతో మరో పటిష్టమైన వ్యూహం కనుగొనాలి. ట్రంప్ 90 రోజుల సడలింపు ఏకపక్షం. దానికి రోడ్ మ్యాప్ ఏదీలేదు. ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్, ఆయన సలహాదారుల బృందం ఒక ప్రణాళిక ప్రకారం నిర్ణయాలు చేస్తున్నారని అభిప్రాయం గొప్పగా ఉంటుంది కానీ, నిజానికి అదో స్పష్టమైన అబద్ధం. సుంకాలపై ట్రంప్ ప్రకటించిన 90 రోజుల విరామం అనిశ్చితిని పెంచుతుంది. ఆర్థిక కార్యకలాపాలు అన్నీ అంచనాలపై ఆధారపడే సాగుతాయి. అనిశ్చితి అంచనాలను తారుమారు చేస్తుంది. కంపెనీలు, సంస్థలు దేశాలు కూడా అప్రమత్తంగా ఉండేటట్లు చేస్తుంది. ట్రంప్ విధించిన 90 రోజుల వాయిదా అనిశ్చితిని పెంచుతుందే కానీ, పరిస్థితిని చక్కదిద్దదు. దేశాలు ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నా.. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాద్యం ప్రమాదం ఉండనే ఉంది. ట్రంప్ తన విధ్వంసకర సుంకాల విధానం ద్వారా రెండు లక్ష్యాలను సాధించాలని ఆశిస్తున్నారు. మొదటిది అమెరికాలో ఉత్పాదకత పెంచే సంస్థల పునరుద్ధరణ, అలాగే అమెరికన్లు కోల్పోయిన బ్లూ కాలర్ ఉద్యోగాలను తిరిగి పొందేలా చేయడం. రెండవది ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో చైనా లాభపడి పైచేయి సాధించకుండా చూడడం. యుఎస్‌లో ట్రంప్‌కు గల రాజకీయ మద్దతు నేపథ్యంలో దేశీయ ఉత్పాదకత పెంచే సంస్థల ప్రోత్సాహం చాలా ముఖ్యం.ండో లక్ష్యం నెరవేరడం కొంత కష్టం. దేశంలో కొత్తగా ఉద్యోగాలు పెరగకుండా, కేవలం అన్ని ఉత్పత్తుల ధరలు పెరిగిపోతే చైనాకు నష్టం కలిగించడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమిటన్నది ప్రశ్న. సమస్య ఏమిటం, ట్రంప్ మొదటి లక్ష్యాన్ని సాధించడం. దేశ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడం, రెండో లక్ష్యమైన చైనాను దెబ్బ తీయడం చాలా కష్టం. ట్రంప్ వ్యూహాలను ఎదుర్కొనేందుకు మరో పక్క చైనా సంసిద్ధంగానే ఉంది. రెండు దశాబ్దాలుగా చైనా భౌగోళిక -ఆర్థిక నియంత్రణకు సంబంధించిన వ్యూహాలపై అమెరికాకు పూర్తి ఎరుక ఉన్న నేపథ్యంలో చైనాకు అమెరికా విషయంలో ఏమి ఆశించాలో, ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాలో అన్న స్పష్టమైన ఆలోచన ఉంది. అసలు ప్రశ్న ఏమిటం. ట్రంప్ పతనానికి అమెరికా సిద్ధంగా ఉందా.. దేశంలో సంస్థలను నెలకొల్పి, ఉత్పాదతకను పునరుద్ధరించడం పార్టీ చేసుకున్నంత సులభం కాదు. దీనికి ఎంతో సమయం అవసరం. ట్రంప్‌కు మద్దతుగా ఉన్న నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రెండు సంవత్సరాలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉన్నా నిరాశ చెందరు. కానీ స్వల్పకాలిక ప్రణాళికలు, దీర్ఘకాలంలో సమకూరే ప్రయోజనాలు రాజకీయంగా లాభదాయకంకాదు. ట్రంప్‌కు దేశీయంగా మద్దతు తగ్గితే ఆయన విదేశాంగ విధానం వల్ల సమకూరే ప్రయోజనం ఏమిటి.. మరింతకాలం గడువు పెరగడమేనా.. గత వారంరోజులుగా ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ వాణిజ్యం, ట్రంప్ విధిస్తున్న సుంకాలపైనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా ఆర్థికవేత్తలే ఈ అంశాలపై వ్యాఖ్యానిస్తున్నారు. ట్రంప్ సుంకాల నిర్ణయాన్ని వాయిదా వేసిన నేపథ్యంలో అంతర్జాతీయ సంబంధాలలో దీర్ఘకాలిక పరిణామాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకునేందుకు రాజకీయ విశ్లేషకులు రంగంలోకి దిగుతున్నారు. అతి ముఖ్యమైన పరిణామం మాత్రం అమెరికాపై అంతర్జాతీయ దేశాలు నమ్మకం కోల్పోవడం. డొనాల్డ్ ట్రంప్ తన చర్యలన్నింటినీ వెనక్కి తీసుకుని, తన ప్రకటనలను, మాటలను దిగమింగినా, ప్రపంచవ్యాప్తంగా కొద్ది మంది ప్రభుత్వాధినేతలు తప్ప ట్రంప్ పరిపాలనను ఇకపై ఎవరూ విశ్వసించరు. ట్రంప్ బాహాటంగా టార్గెట్ చేసి, స్పష్టంగా దూరం చేసుకున్న దేశాలలో కెనడా, మెక్సికో, డెన్మార్క్, దక్షిణాఫ్రికా ముఖ్యమైనవి. ఆ తర్వాత ట్రంప్‌ను బహిరంగంగా విమర్శించేందుకు సిద్ధమైన నాయకులు ఉన్న దేశాలలో బ్రెజిల్, కొలంబియా, జర్మనీ, ఫ్రాన్స్, సింగపూర్, నమీబియా, ఆస్ట్రేలియా ఉన్నాయి. అయితే, ఇప్పటివరకూ ట్రంప్ పట్ల ప్రపంచవ్యాప్తంగా పూర్తిస్థాయి లో అసమ్మతి వ్యక్తం కాలేదు. యురోపియన్ యూనియన్ దేశాలలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మెజారిటీ దేశాలు మాత్రం అమెరికాను ఇకపై విశ్వసించవు. యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డేర్ లేయన్ వివిధ దేశాలపై విధించిన ప్రతీకార సుంకాలను 90 రోజులపాటు వాయిదా వేయడాన్ని స్వాగతించారు. అదే సమయంలో యురోపియన్ యూనియన్ తమ అంతర్గత మార్కెట్‌ను మరింత విస్తృతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యురోపియన్ యూనియన్ చైనాతో వాణిజ్య సంబంధాలను సజావుగా కొనసాగిస్తోంది. మున్ముందు భారతదేశంతోనూ, ఇతర దేశాలతోనూ వాణిజ్య సంబంధాలు పెంచుకోవచ్చు. జపాన్ పరిస్థితి మరోలా ఉంది. జపాన్ అమెరికా బాండ్ మార్కెట్‌లో అమ్మకాలు చేయడం ద్వారా 90 రోజుల వాయిదాను తిప్పికొట్టి ఉండవచ్చు. జపాన్ కూడా చైనాతో వాణిజ్య సంబంధాలను మరింత పెంచుకోవచ్చు. భారత రాజకీయ నాయకత్వం మాత్రం ఆచీతూచీ అడుగులు వేస్తోంది. ట్రంప్ దాడి ప్రధానంగా చైనాపై ఉండడం పట్ల సంతోషంగానే ఉంది. అమెరికా నుంచి మరిన్ని రక్షణ పరికరాలతో పాటు, కీలక ఉత్పత్తులు కొనుగోలు చేయడానికిఆఫర్ చేయడం ద్వారా ట్రంప్‌తో పలు వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునేందుకు సిద్ధపడుతోంది. అయితే, ట్రంప్ మొదటి పదవీకాలంలో ఉన్నంత సన్నిహితంగా నరేంద్రమోడీ ట్రంప్‌తో వ్యవహరిస్తారా అన్నది చూడాలి. ఎందుకంటే ట్రంప్ దాదాపు డైరెక్టుగానే భారత దేశంతో అంత సన్నిహిత స్నేహసంబంధాలు లేవని పదేపదే అంటూ, మోడీకి ఖేదం కలిగిస్తున్నారు. ట్రంప్ భారతదేశం గురించి చెడుగా, కాస్త తక్కువచేసి మాట్లాడడాన్ని భారతదేశంలోని ఉన్నత వర్గాలు, మీడియా, రాజకీయ వర్గాలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. దీనిపై వివరణ ఇచ్చేందుకు సిద్ధపడినవారూ ఉన్నారు. మోడీ వంటి ఆత్మాభిమానం గల, స్వీయంగా ఇమేజ్ గల నాయకుడు తనకు ఎదురైన అవమానాలపై లోలోన ఆగ్రహించి ఉండవచ్చు. అమెరికా భారతదేశం మధ్య చాలా ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిలుపుకోవాలని కూడా భారతదేశం కోరుకుంటోంది. అయితే జపాన్‌కు చెందిన షిగేరు ఇషిబా, ఇటలీకి చెందిన జార్జియా మెలోని మాదిరిగా ట్రంప్ ముందు సాగిలపడాలని ఏ భారతీయ నాయకుడు అనుకోరు అన్నది సుస్పష్టం. భారత ప్రధాని మోడీ ఇంతవరకూ మౌనం వహించారు. బహుశా అమెరికాతో వాణిజ్య ఒప్పందాలపై జరుగుతున్న చర్చలు ఇంకా పురోగమదిశలో ఉండడమే కారణం కావచ్చు. దీంతో ఇతర ప్రపంచ దేశాలకు స్పందించే అవకాశం వచ్చింది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల ఆందోళనలను ఎత్తిచూపుతూ, సంఘీభావం వ్యక్తం చేసేందుకు చైనా సంసిద్ధమైంది. ఈ విషయంలో భారతదేశాన్ని కలుపుకుపోవడానికి ముందడుగు వేసింది. చైనాతో పాటు బ్రెజిల్, దక్షిణాఫ్రికా నాయకులు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశాయి. ఇక భారతదేశం నుంచి స్పష్టమైన ప్రకటన కోసం ప్రపంచం ఎదురు చూస్తోంది.

# అన్నదాతను దెబ్బతీస్తున్న అకాల వర్షాలు

నిజామాబాద్,తీవ్రమైన ఎండలు, ఈదురుగాలుల బీభత్సం, అకాల వర్షాలతో ఆదరబాదరగా పంటలను అమ్మేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఏర్పడింది. ముందుచూపుతో పంట చేతికొచ్చే సమయానికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉండదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించినా..ఎలాంటి ప్రయోజ నం ఉండదని రైతులు అంటున్నారు. అన్నదాతల అవసరాలు, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దళారులు అందినకాడికి దండుకోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా అధికారులకు ముందే తెలిసినా.. ముందుచూపు లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. పంట వేసిన తర్వాత సుమారు 3, 4 నెలల పాటు సమయం ఉంటుంది. కాని ఏటా పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతూనే ఉంది. ఈ యేడు మొక్కజొన్న పంట కొనుగోళ్లపై సందిగ్ధ పరిస్థితులే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం వరికి ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని చెప్పడంతో జిల్లాల్లో భారీగా ఆరుతడి పంటలనే ఎక్కువగా సాగు చేశారు. ఇందులో ప్రధానంగా జొన్న, మొక్క జొన్న, శనగ, తదితర పంటలు సాగయ్యాయి. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రతీసారి కొనుగోళ్ల పక్రియ ఆలస్యం కావడంతో సగం పంట దళారుల పాలవుతూనే ఉంది. ఈసారి కూడా అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సగం పంట అమ్మిన తర్వాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉండదంటున్నారు. కొన్ని జిల్లాల్లో మార్క్‌ఫెడ్ అధికారులు సగం పంటలను మాత్రమే కొనుగోలు చేసి టార్గెట్ పూర్తయ్యిందని ప్రకటించుకున్నారు. ఇలాంటి పరిస్థితులకు అవకాశం ఇవ్వకుండా ముందుచూపుతో వ్యవహరిస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు కొనుగోలు పక్రియను మొదలు పెట్టకపోవడంతో మద్దతు ధర కొందరికే దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పంట నూర్పిడి చేసిన రైతులు.. బయట మార్కెట్‌లో దళారులను ఆశ్రయించి దిగుబడులను అమ్మేసుకుంటున్నారు. దళారులు ఇంటికే వచ్చి రైతులను మభ్యపెడుతూ తక్కువ ధరకే పంటను కొనుగోలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతేడాది రైతులు ఆందోళనలు, ధర్నా లు, నిరసనలు చేపట్టడంతోనే దిగొచ్చిన ప్రభుత్వం.. చివరి సమయంలో కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాలకు పంట దిగుబడులు తడవడంతో మద్దతుధరలో కోతలు విధించారు. చేతికొచ్చిన పంటను చేనులోనే కుప్పలుగా పోసి అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తుందని చెబుతున్నారు. వాతావరణం సహకరించకుంటే దిగుబడులు చేతికొచ్చినా.. కష్టంగానే ఉంటుందని వాపోతున్నారు. ఈదురుగాలుల బీభత్సం, అకాల వర్షాలకు పంట దిగుబడులు తడిసిపోయే అవకాశం ఉందని, మరో పక్షం రోజుల్లో అకాల వర్షాలు, ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఇకనైనా సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

కాకినాడ, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 20 రోజుల నుంచి వరి కోతలు సాగుతున్నాయి. ఇప్పటివరకు 12 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. 43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. కాని ఇందులో వంద మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా నేటికీ కొనుగోలు చేయలేదు. ధాన్యం సేకరణకు జిల్లాలో 225 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు- చేసినా రైతులకు ఉపయోగపడడం లేదు. ఈ నెల మూడు నుంచి కొనుగోళ్లను ప్రారంభించామని అధికారులు ప్రకటించినప్పటికీ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించకపోవడంతో కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు విధించడం, కొనుగోలు కేంద్రాలకు సిబ్బంది రాకపోవడంతో అన్నదాతలకు దిక్కుతోచడం లేదు. వాతావరణ మార్పులు, ధాన్యం నిల్వ చేసుకునే వెసులుబాటు- లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటి వరకూ కేవలం 98 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో కాకినాడ జిల్లాలో 1.62 లక్షల ఎకరాల్లో 1.45 లక్షల మంది రైతులు వరిని పండించారు. 5.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, తేమ శాతం తదితర నిబంధనల వల్ల రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. మరోపక్క సిబ్బంది కూడా కొనుగోలు కేంద్రాలకు పూర్తిస్థాయిలో రావడం లేదు. గత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో చాలామంది విధులకు గైర్హాజరవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొన్నిచోట్ల సిబ్బంది హాజరవుతున్నప్పటికీ కొనుగోళ్లు మాత్రం నత్తనడకనే సాగుతున్నాయి. ఇప్పటి వరకు రెండు కేంద్రాల నుంచి 98 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం కేంద్రాల పనితీరుకు నిదర్శనం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సరిగా పనిచేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం సాధారణ రకం క్వింటాలు రూ.2,300, ఎ-గ్రేడ్ రకానికి రూ.2,320 మద్దతు ధరగా ప్రకటించింది. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం 75 కిలోలకు సాధారణ రకానికి రూ.1725, ఎ-గ్రేడ్ రకానికి రూ.1740 రావాల్సి ఉంది. కానీ దళారులు రూ.1,400 మించి కొనుగోలు చేయడం లేదు. కోతలు కోసిన తర్వాత తేమ శాతం ఎక్కువగా చూపించి రూ.1000కే అడుగుతున్నారని పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని పలువురు రైతులు చెబుతున్నారు. బస్తాపై రూ.340 నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటి-కై-నా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను అందుబాటు-లోకి తీసుకొచ్చి నిబంధనలను సడలించి మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఇంకా సేకరించడం లేదని రైతులు వాపోతున్నారు. సాధారణ రకం మద్దతు ధర ప్రకారం (75 కిలోలు) రూ.1,740 అని చెబుతున్నారు. ప్రయివేటు వ్యాపారులకు రూ.1,400కు అమ్ముకోవాల్సి వచ్చింది. ఒక్కో బస్తాపై రూ.340 నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనలు సడలించి మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేటు- వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. తేమ శాతం పేరుతో వారు తక్కువ ధర చెల్లిస్తున్నారు. వాతావరణ మార్పులు, ధాన్యం దాచుకునే వీలు లేకపోవడంతో తక్కువ రేటుకే అమ్ముకోవాల్సి వస్తోంది.

## నల్లగొండ పట్టణంలో వ్యక్తి దారుణ హత్య

నల్లగొండ,నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి దారుణ హత్య జరిగింది. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనే గుర్తుతెలియని దుండగులు వేటకొడవళ్లతో ఓ వ్యక్తిని నరికి చంపేశారు. రామగిరి ప్రాంతంలోని గీతాంజలి కాంప్లెక్స్‌లో సురేశ్ (37) మణికంఠ లేజర్ కలర్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నారు.

## జమిలి ఎన్నికలతో దేశానికి మేలు

తిరుపతి, జమిలి ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీలకు ఇబ్బంది అనేది అపోహ అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఒకప్పుడు ఎన్నికలన్నీ కలిసే జరిగాయన్న విషయం మరచి మాట్లాడుతున్నారని అన్నారు. కలసి ఎన్నికలు జరగడం దేశానికి మంచిదన్నారు. తిరుపతిలో 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' అంశంపై నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. సాంకేతిక సాయంతో జమిలి ఎన్నికలు జరపడం కష్టం కాదని చెప్పారు. కొన్ని పార్టీలు దీన్ని వ్యతిరేకించడంలో రాజకీయ కోణం తప్ప మరేమీ లేదని పేర్కొన్నారు. జమిలి ద్వారా ఎన్నికల ఖర్చు ఆదా అవుతుందన్నారు. అధికారం పోతే కొన్ని పార్టీలు తట్టుకోలేకపోతున్నాయని, సంయమనం కోల్పోతున్నాయని ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి చేటు అని పేర్కొన్నారు. పార్టీ మారే నేతలు పదవికి రాజీనామా చేయాలనే నిబంధన రావాలని వెంకయ్యనాయుడు సూచించారు. అలాగే రాజకీయనేతలు సంయమనంతో మాట్లాడాలని, నిందలు, అసభ్య పదజాలం ఉపయోగించే సంస్కృతి మంచిది కాదన్నారు. గత ఎన్నికలలో బూతులు మాట్లాడిన నేతలు అందరూ ఓడిపోయారు.. వారు ఎవరో మీకే తెలుసు అంటూ సెటైర్లు వేశారు. అసెంబ్లీలో అభివృద్ధి, సిద్ధాంతాలు, సమస్యలపై చర్చల కంటే నేతల బూతులు ఎక్కువయ్యాయి.. అసెంబ్లీలో బట్టలు చించుకుని కొట్టుకునే పరిస్థితి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇంట్లో ఉండే అమ్మను, భార్యను తమ నేతతో బూతులు తిట్టించి కొందరు రాక్షసానందం పొందారన్న ఆయన.. నువ్వే నా.. మేం అంతే అంటూ మరికొద్దిమంది బూతులు మాట్లాడుతున్నారని అన్నారు. గత ఎన్నికలలో భూతులు మాట్లాడిన నేతలు అందరూ ఓడిపోయారు.. వారు ఎవరో మీకే తెలుసు.. ప్రజలు అందరూ ఆ నేతల బూతులు వినలేక.. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేసి ఓడించారు.. బూతుల కంటే పోలింగ్ బూత్ గొప్పది.. బలమైనది అని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండాలి.. భాషను జాగ్రత్తగా వాడాలి అని వెంకయ్య నాయుడు సూచించారు.. ఇక, ఉచిత పథకాలు సరికాదని నేను వ్యతిరేకం... చదువు, వైద్యం మాత్రమే ఉచితంగా ఇవ్వాలి.. కానీ, ఉచితపథకాల వల్ల నష్టం తప్ప లాభం ఉండదు అన్నారు.. మరోవైపు, ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల సమయం ఆదా, ఖర్చు ఆదా అవుతుందన్నారు.. ఎన్నికల ఖర్చు వేలకోట్లకు చేరింది.. నేను ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో ప్రజలు విరాళంగా కొంత డబ్బులు ఇచ్చారు.. నేను రూపాయల జేబులో నుండి తీయలేదు.. ఒక్క రూపాయి జేబులో వేసుకోలేదని గుర్తుచేసుకున్నారు.. రాజకీయాల్లో కులం, ధనం, మతం లేకుండా చేయాలి.. కానీ, కులం, డబ్బులు, క్రిమినల్స్‌కి ఇప్పుడున్న పార్టీలు ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఇది విపరీత పరిణామాలకు దారితీస్తోందని గుర్తించాలని అన్నారు.

## దేశంలో ఉగ్రదాడులు జరిగే ప్రమాదం

న్యూఢిల్లీ, దేశంలో ఉగ్రదాడులు జరగొచ్చని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ మేరకు రైల్వేశాఖను అప్రమత్తం చేశాయి. డ్రోన్, ఐఈడీతో దాడులు జరగవచ్చని సూచించాయి. తాజాగా పశ్చిమ బెంగాల్‌లో హింస చెలరేగింది. రెండు చోట్ల రైల్వే స్టేషన్‌లోకి చొరబడి రైల్వే ఆస్తులను ధ్వంసం చేశారు. వక్ఫ్ చట్టం వ్యతిరేకంగా అల్లర్లు సృష్టిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నా.. దీని వెనుక కుట్ర దాగి ఉన్నట్లు-గా గవర్నర్ ఆనంద్ బోస్ అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఇప్పటికే పోలీసులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని అలర్ట్ చేశారు. ఉగ్రవాదులు నదీమార్గాల ద్వారా దేశంలోకి చొరబడ వచ్చని నిఘా వర్గాలు తెలిపాయి. ముంబై దాడుల నిందితుడు తహవూర్ రాణాను అమెరికా నుంచి ఢిల్లీకి తీసుకొచ్చాక.. నిఘా వర్గాలు హెచ్చరిక చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే జమ్మూకాశ్మీర్‌లోని బోర్డర్‌లో ఉగ్రవాదులు చొరబాటుకు ప్రయత్నించగా.. ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఈ ఘటనలో ఒక సైనికుడు కూడా అమరుడయ్యాడు. నదీమార్గాల్లో తీవ్రవాదులు చొరబడవచ్చని చెప్పాయి. ముంబయి ఉగ్రదాడి కీలక కుట్రదారు తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు తీసుకువచ్చి విచారిస్తోన్న తరుణంలో ఈ అలర్ట్ రావడం గమనార్హం. 2008 నవంబర్ 26న 10మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా ముంబయికి చేరుకొని.. సీఎస్‌ఎంటీ, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారు. నవంబర్ 29 వరకు మారణహోమం కొనసాగింది. ఈ ఘటనల్లో 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మంది ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు. అప్పటి యాంటీ-టె-్రరిజం స్క్వాడ్ (ఏటీ-ఎస్) చీఫ్ హేమంత్ కర్కరే, ఆర్మీ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్, ముంబయి అదనపు పోలీస్ కమిషనర్ అశోక్ కామ్టే, సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయ్ సలాస్కర్‌లు అమరుల య్యారు. రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. ముంబయి దాడుల్లో కీలక సూత్రధారి.

### అతను ప్రమాదంలోనే మరణించాడు

రాజమండ్రి,పాస్టర్ ప్రవీణ్ మృతిపై వివిధ రకాలుగా దర్యాప్తు చేపట్టి అసలు విషయాలు గుర్తించామని, అతను కేవలం రోడ్డు ప్రమాదంలోనే మరణించాడని నిర్ధారణ అయ్యిందని ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి రాజమహేంద్రవరంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన హైదరాబాద్, కోదాడ, ఏలూరులో మద్యం దుకాణాలకు వెళ్లారు. దారిలో ఆయనకు 3 సార్లు చిన్న చిన్న ప్రమాదాలు జరిగాయని వివరించారు. కీసర టోల్‌ప్లాజా వద్ద ఆయన అదుపుతప్పి కింద పడిపోయారు. సాయం చేసేందుకు అంబులెన్స్, వైద్య సిబ్బంది వెళ్లారు. రామవరప్పాడు జంక్షన్ వద్ద ప్రవీణ్ పరిస్థితిని ఆటో డ్రైవర్ చూశారు. ట్రాఫిక్ ఎస్సై సూచనతో పార్కులో రెండు గంటలు నిద్రపోయారు. కండిషన్ బాగోలేదు, వెళ్లవద్దని చెప్పినా ఆయన వినలేదు. హెడ్‌లైట్ పగిలిపోవడంతో రైట్‌సైడ్ బ్లింకర్ వేసుకునే ప్రయాణించారు. ఏలూరులో ఆయన మద్యం కొనుగోలు చేశారు. మద్యం దుకాణానికి వచ్చినప్పటికే ప్రవీణ్ కళ్లజోడు పగిలిపోయి ఉంది. కొంతమూరు పైవంతెనపై కూడా ఆయన వేగంగా వెళ్లారు. ప్రమాదం జరిగిన స్థలంలో బుల్లెట్ వాహనం రోడ్డు పక్కకు దూసుకుపోయింది. ఆయన బుల్లెట్‌ను ఏ వాహనం కూడా ఢీకొనలేదు. బైక్‌కు, పక్కన వెళ్తున్న కారుకు చాలా గ్యాప్ ఉంది. ప్రమాద స్థలంలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. కంకర రాళ్లు ఉన్నాయి. బుల్లెట్ పైకి ఎగిరి పాస్టర్ ప్రవీణ్‌పై పడిందని ఫోరెన్సిక్ నివేదిక చెప్పింది. ప్రమాదం జరిగినప్పుడు బండి ఫోర్త్‌గేర్‌లో ఉంది. ఇతర వాహనాలను ఢీకొనలేదని ఫోరెన్సిక్ నిపుణులు స్పష్టం చేశారని ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ కేసుపై ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ నర్సింహ కిషోర్‌లు శనివారం నాడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. పాస్టర్ పగడాల ప్రవీణ్ గతనెల 24వ తేదీన మృతిచెందారని అన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఈ కేసు దర్యాప్తు చేశామని చెప్పారు. 26వ తేదీన డాక్టర్లు పోస్టుమార్టం చేశారని అన్నారు. హైదరాబాద్ ఫోరెనిక్స్ ల్యాబోరేటరీకి పంపామని తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ హైదరాబాద్ నుంచి బయలుదేరి రాజమండ్రి వచ్చే వరకు సీసీ ఫుటేజ్ సేకరించామని అన్నారు.

# ఏటా రైతులకు తిప్పలు...

న్యూఢిల్లీ,ఏటా రైతులకు తిప్పలు తప్పడం లేదు. పాలకులు మాటలే తప్ప క్షేత్రస్థాయిలో పథకాలు అమలు కావడం లేదు. కనీస మద్దతు ధరలు ప్రకటించినా వాటిని అమలు చేయడంలో శ్రద్ధ చూపడం లేదు. తాలు పేరుతో, దడవాయి పేరుతో దోచేస్తున్నారు. పంటలకు సకాలంలో రుణాలు అందడం లేదు. బ్యాంకులు కూడా పైకి చెప్పినంతగా ఉదారంగా ఉండడం లేదు. పంటరుణాలను ప్రైవేట్ వ్యక్తుల నుంచే తెచ్చుకోవాల్సి వస్తోంది. దళారులు కొన్న తరవాతే ప్రభుత్వం అధికారులు రంగప్రవేశం చేస్తారు. పంటల కోసం తెచ్చిన పెట్టుబడి అప్పులు తీర్చే తొందరలో ధాన్యాన్ని, పంటలను వచ్చిన రేటుకు, అంటే దళారుల రేటుకు అమ్ముకోక తప్పడం లేదు.



ఇదంతా క్షేత్రస్తాయిలో అధికారులకు తెలుసు. మార్కెట్ కమిటీలు పెట్టినా,సహకార సంఘాలు ఉన్నా.. ధాన్యం చేతికొచ్చే సమయానికి తిప్పలు పడక తప్పడం లేదు. పంట ఏదైనా ఇదే దుస్థితి ఉంది. కొనుగోళ్ల విషయంలో ఆందోళనలు రాజకీయపార్టీల బలాబలాల ప్రదర్శనగా ఉందే తప్ప రైతులను ఆదుకునే విధానంలా ఉండడం లేదు. ఇందులో అన్ని పార్టీలు ఎవరికివారు తమవంతు రాజకీయ లాభం కోరే పాత్ర పోషిస్తూ రక్తి కట్టిస్తున్నారు. పాలకులు తమ రాజకీయ విన్యాసాలకు ప్రజలను ఎలా మోసం చేస్తారో స్పష్టంగా కనిపిస్తోంది. జానికి కేంద్రం తీరు కూడా ఏ మాత్రం సరిగా లేదు.ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు. ధాన్యం కొనుగేళ్లే కాదు..అనేకానేక విషయాల్లో కేంద్రాన్ని నిలదీయాల్సిందే. రైతులు బతకడానికే కష్టపడుతున్నారు. మనలను బతికించడానికి వారు వ్యవసాయం చేస్తున్నారు. కేంద్రం పెట్రో, డీజిల్,గ్యాస్ ధరలతో మొత్తంగా అన్ని సరకుల ధరలు పెంచుతూ పోతున్నది. సామాన్యులు నానాయాతనలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. అలాగే ధాన్యం ధరలను ఏటేటా పెంచడం లేదు. ఎవరికి వారు ధాన్యం ధరలు ని÷-ణయించుకునే పరిస్థితి లేదు.నిజానికి వ్యవసాయంపై జాతీయ విధానం రావాల్సిందే. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శక విధానం రావాలి. వ్యవసాయ దిగుమతులను తగ్గించుకుని..ఎగుమతులను పెంచుకోవాలి. వంటనూనెలను దిగుమతిని ఆపేయాలి. దేశీయంగా పంటలకు ప్రోత్సాహం ఇవ్వాల్సిందే. ఇవన్నీ చర్చించడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అన్ని రాష్ట్రాల్లో ఏకాభిప్రాయం రావాలి. కానీ అలా జగరడం లేదు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చూసుకుంటున్నారే తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదు. రైతుల పట్ల ఎలాంటి వివక్ష చూపడం లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ధాన్యం కొనుగోళ్లు మాత్రం సజావుగా సాడం లేదు. ఇప్పుడు వడగళ్ల వానల కాలం. ధాన్యం కల్లాల్లోకి చేరకముందే తడిసి ముద్దవుతోంది. కల్లాల్లో కొన్నిసార్లు తడిసి కొట్టుకు పోతోంది. ఇదంతా దైవాధీనంగా రైతుల పరిస్థితి ఉంది. మార్కెట్లో పత్తి, మిర్చి, వరి తదితర పంటలు వచ్చినా..ట్రాక్టర్లు బారులు తీరినా సక్రమంగా అమ్ముకుని ఇంటికి చేరుతామన్న ధైర్యం రైతుల్లో ఏ రోజూ కనిపించడం లేదు. పంజాబ్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన తరహాలోనే దేశమంతటా ఒకే విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్రం తెలిపినా ..ఏటేటా మాత్రం ధాన్యం అమ్మకాల వ్యవహారం ప్రహసనంగా మారుతోంది. తెలంగాణలో డీసెంట్రలైజ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం (డీసీపీ)లో బియ్యం సేకరిస్తున్నామని.. పంజాబ్ నుంచి నాన్ డీసీపీ విధానంలో సెంట్రల్ పూల్ ద్వారా బియ్యం సేకరించి ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ నేటిదాకా ఒకే విధానం అమల్లో ఉందని కేంద్ర అధికారులు చెప్పారు. తెలంగాణ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన బియ్యాన్ని సెంట్రల్ పూల్ కింద ఎఫ్‌సీఐకి అప్పగిస్తోందని గుర్తు చేశారు.

# 'హైడ్రో'తో ఆదివాసీ హక్కుల ఉల్లంఘన



హైదరాబాద్,రాష్ట్రంలో న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్.ఆర్.ఇ.డి.సి.ఎ.పి) ద్వారా 7,400 మెగావాట్ల సామర్థ్యంతో పంప్ట్ స్టోరేజి పవర్ ప్రాజెక్టులకు 2019 నుండి 2025 మధ్య రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఉత్తరాంధ్ర 'ఏజెన్సీ' ప్రాంతాలలో- రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లోని ఆదివాసీలను, ఇతర పేదలను వారి ఆవాసాల నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నించడం దారుణం.

హైడ్రో పవర్ ప్రాజెక్టు సామర్థ్యం-కేటాయింపు

పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు మండలంలో కురుకుట్టి పి.ఎస్.పి (1,200 మెగావాట్లు), పాచిపెంట మండలంలో కర్రివలస పి.ఎస్.పి (1,000 మెగావాట్లు) ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి మండలంలోని పెదకోట పి.ఎస్.పి 2024 ఆగస్టులో దాని సామర్థ్యాన్ని 1,500 మెగావాట్లు నుండి 1,800 మెగావాట్లకి పెంచింది. నవయుగ కంపెనీకి గుజ్జిలి పి.ఎస్.పి (1,500 మెగావాట్లు), చిట్టాంపాడు పి.ఎస్.పి (800 మెగావాట్లు) కేటాయించారు. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు చింతపల్లి, కొయ్యూరు మండలాల్లోని యర్రవరం పి.ఎస్.పి (1,200 మెగావాట్లు) కేటాయించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుపై గోప్యత ఎందుకు?

1/70 చట్టాన్ని, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో వర్తించే వివిధ రాజ్యాంగ నిబంధనలను బహిరంగంగా ధిక్కరిస్తూ ఈ ప్రాజెక్టులకు అనుమతించిన తీరు తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వీటిలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీల షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు నియమాలు (పెసా), అటవీ హక్కుల చట్టం (ఎఫ్.ఆర్.ఏ) ఉన్నాయి. ముఖ్యంగా పెసా లోని సెక్షన్ 5 ప్రకారం ఏదైనా భూసేకరణకు ముందు, ప్రభుత్వం వివరణాత్మక ప్రాజెక్ట్ సమాచారాన్ని మండల ప్రజా పరిషత్‌కి సమర్పించాలి. ఈ సమాచారంలో సమగ్ర ప్రాజెక్ట్ రూపురేఖలు, సామాజిక ప్రభావాలు, భూసేకరణ ప్రత్యేకతలు, కొత్త స్థిరనివాసుల గురించి సమాచారం, వారి తెగలపై సామాజిక ప్రభావం, ప్రభావిత వర్గాలకు ప్రతిపాదిత పరిహారం వంటివి ఉండాలి. అప్పుడు ఎంపిపి చట్టబద్ధంగా ప్రభావిత గ్రామ పంచాయతీ, గ్రామ సభలతో సంప్రదించి వారి అంచనాలు, సిఫార్సులను సేకరించాలి. ఈ సంప్రదింపుల తర్వాత, ఎం.పి.పి ఈ సిఫార్సులను ఏకీకృతం చేసి, భూసేకరణ అధికారికి తుది సిఫార్సును సమర్పించాలి. వారు ఈ సిఫార్సులకు కట్టుబడి ఉండాలి. లేదా తేడా చేస్తే వివరణాత్మక రాతపూర్వక సమాధానం అందించాలి. ఎఫ్.ఆర్.ఏ లోని సెక్షన్ 6, వ్యక్తిగత, కమ్యూనిటీ అటవీ హక్కులను నిర్ణయించే ప్రక్రియను ప్రారంభించడానికి, పర్యవేక్షించడానికి గ్రామసభను ప్రాథమిక అధికారంగా స్పష్టంగా పేర్కొంటుంది. అటవీ భూమిని లేదా అటవీ నివాసుల హక్కులను ప్రభావితం చేసే ఏదైనా ప్రాజెక్ట్ ప్రారంభం నుండే గ్రామసభ పాల్గొనాలని ఎఫ్.ఆర్.ఏ నిర్దేశిస్తుంది. అంతేకాకుండా, ఎఫ్.ఆర్.ఏ లోని సెక్షన్ 4(డి) కమ్యూనిటీ అటవీ వనరులను నియంత్రించడానికి, వన్యప్రాణులు-జీవవైవిధ్య రక్షణకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడానికి గ్రామసభ అధికారాన్ని బలోపేతం చేస్తుంది. ఆదివాసీ తెగలు, కంపెనీలైన వాటాదారులు ఈ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని నిర్దేశిస్తుంది. ఈ సంప్రదింపుల ప్రక్రియను దాటవేశారు. ఈ పి.ఎస్.పి లకు సంబంధించి, ఎటువంటి సమాచారం అందించబడలేదు. ఎటువంటి చర్చ జరగలేదు. పారదర్శకత లేదు. ఈ ప్రాంతాల్లోని ఆదివాసీలకు ఉద్దేశపూర్వకంగా దీన్ని గోప్యంగా ఉంచారు. ఆదివాసీ తెగల నుండి సంప్రదింపులు, సమ్మతి లేకపోవడాన్ని మనం గమనించాలి. షెడ్యూల్డ్ ప్రాంతాలలో భూమిని లీజుకు ఇవ్వడం ఆంధ్రప్రదేశ్ భూ బదిలీ నియంత్రణ (ఎల్.టి.ఆర్) చట్టం ద్వారా నిషేధం. షెడ్యూల్డ్ ప్రాంతాలలో ప్రైవేట్ సంస్థలు ప్రాజెక్టులను చేపట్టలేవని సుప్రీంకోర్టు 1997 సమతా కేసులో పేర్కొంది. అంతేకాకుండా, ఇది చట్టబద్ధమైన అవసరం అయినప్పటికీ, గిరిజన సలహా మండలి (టి.ఎ.సి)లో ఈ ప్రాజెక్టులపై చర్చ, ముందస్తు సంప్రదింపులు జరపడానికి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికీ టి.ఎ.సి ని నియమించలేదు. ఈ ఆరు ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వల్ల కలిగే భారీ స్థాయి స్థానభ్రంశం గురించి, ఆదివాసీ తెగ వర్గాల జీవనోపాధిని కోల్పోయే అవకాశం గురించి ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తుంది.

అటవీ, వ్యవసాయ భూమి సేకరణ

యర్రవరం ప్రాజెక్టుకు అత్యధికంగా 735.63 ఎకరాలు, తరువాత గుజ్జిలి 673.13 ఎకరాలు, పెదకోట 499.44 ఎకరాలు, కురుకుట్టి 422.99 ఎకరాలు, కర్రివలస 377.99, చిట్టంపాడు 500 ఎకరాలు అవసరం. మొత్తం ఉద్దేశించిన 3,361.35 ఎకరాల భూ సేకరణకు ప్రభుత్వ ప్రణాళిక సిద్ధం చేసింది. కానీ వాస్తవానికి సుమారు పది వేల ఎకరాల అటవీ, వ్యవసాయ భూమికి నష్టం జరిగే అవకాశం ఉందని ఆదివాసీ తెగలు పేర్కొంటున్నాయి.భూసేకరణ సమస్యకు మించి, స్థానిక నీటి వనరులపై ప్రాజెక్టులు ఆధారపడటం వలన నీటి భద్రత గురించి, ఈ వనరులపై ఆధారపడిన ఆదివాసీ తెగలు, దిగువ రైతులపై దాని సామాజిక ప్రభావం గురించి తీవ్రమైన ఆందోళనలు తలెత్తాయి. ఈ పి.ఎస్.పి లలో ప్రతి ఒక్కటి ఎగువ, దిగువ జలాశయాన్ని నిర్మిస్తారు. దీనికి చాలా పెద్ద మొత్తంలో భూమి అవసరం. వరద ఉధృతితో వేలాది ఎకరాల అటవీ,వ్యవసాయ భూమి మునిగే అవకాశాలు చాలా ఎక్కువ.

నీటి భద్రత-ఆందోళన

కురుకుట్టి, కర్రివలస పి.ఎస్.పి లు రెండూ బోదురుగెడ్డ నది నుండి నీటిని తీసుకోవడానికి నిర్ణయించబడ్డాయి. ఇది ఒడిశాలో ఉద్భవించి, ఆంధ్రప్రదేశ్ గుండా ప్రవహించి, నాగావళి నది పరీవాహక ప్రాంతంలోని సువర్ణముఖి నదిలో కలుస్తుంది. ఈ రెండు ప్రాజెక్టులు ఈ నదిపై నిర్మించిన దిగువ జలాశయాన్ని పంచుకుంటాయి. అదే సమయంలో, ఎర్రవరం (పి.ఎస్.పి) ఎర్రవరం, గనగుల గ్రామాల మధ్య ప్రవహించే ఒక చిన్న, పేరులేని ప్రవాహం నుండి నీటిని పొందాలని నిర్ణయించారు. నీరు తగ్గి చివరికి తాండవ జలాశయం ఖాళీ అవుతుంది. దిగువ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.శారద నదిలోకి ప్రవహించే రెండు చిన్న ప్రవాహాల నుండి నీటిని తీసుకునే ఓపెన్-లూప్ వ్యవస్థగా మొదట భావించిన గుజ్జిలి పి.ఎస్.పి, తరువాత పర్యావరణ సమస్యలకు ప్రతిస్పందనగా క్లోజ్డ్-లూప్ వ్యవస్థగా పున:రూపకల్పన చేయబడింది. ఇది ఇప్పుడు దిగువ జలాశయం నుండి 6.8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోనాం జలాశయం నుండి నీటిని ఉపయోగించుకుంటుంది. బొడ్డేరు నదిపై నిర్మించిన కోనాం జలాశయం ప్రస్తుతం 12,638 ఎకరాల సాగునీటి ప్రాంతానికి సేవలు అందిస్తుంది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఈ పి.ఎస్.పి కి దిగువ జలాశయంగా పనిచేస్తుంది. అదేవిధంగా, పెదకోట పి.ఎస్.పి యొక్క నీటి వనరు కూడా పర్యావరణ పరిగణనల కారణంగా మార్చబడింది. ప్రారంభంలో బొడ్డేరు నది (శారద నది ఉపనది)పై దిగువ జలాశయంతో ఓపెన్-లూప్ వ్యవస్థగా రూపొందించబడిన దీనిని క్లోజ్డ్-లూప్ వ్యవస్థగా సవరించారు. బొడ్డేరు నది యొక్క సహజ ప్రవాహాన్ని కాపాడటానికి కోనం జలాశయాన్ని దాని నీటి వనరుగా ఉపయోగించుకోవడానికి కూడా ఉద్దేశించబడింది.గుజ్జిలి, పెదకోట పి.ఎస్.పి లను క్లోజ్డ్-లూప్ వ్యవస్థలుగా పున:రూపకల్పన చేసినప్పటికీ, పర్యావరణ ప్రభావంపై ఆందోళనలు కల్గిస్తోంది. పెదకోట ప్రాజెక్టను క్లోజ్డ్-లూప్ వ్యవస్థగా పున:రూపకల్పన చేసినప్పటికీ, నిపుణుల అంచనా కమిటీ (ఇ.ఎ.సి) బొడ్డేరు నదిపై దాని దిగువ జలాశయం ఉన్నందున దీనిని ఓపెన్-లూప్ ప్రాజెక్ట్‌గా మార్చారు. తత్ఫలితంగా, ప్రాజెక్ట్ ప్రతిపాదకులు కేంద్ర విద్యుత్ అథారిటీ (సి.ఇ.ఏ), కేంద్ర జల సంఘం (సి.డబ్ల్యు.సి) నుండి ఆమోదాల కోసం దీనిని ఓపెన్-లూప్ వ్యవస్థగా పరిగణించి వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (డి.పి.ఆర్)ను సిద్ధం చేయాలని ఇ.ఎ.సి సిఫార్సు చేసింది.ఇంకా ఆందోళన కరమైన విషయం ఏమిటంటే, ఈ ప్రాజెక్టులలో ఆదివాసీలు తమ జీవనోపాధి కోసం-గృహ అవసరాలు, వ్యవసాయం కోసం ఉపయోగించే స్థానిక వనరుల నుండి నీటిని తీసుకోవడం జరుగుతుంది. ఈ వాగులు, నీటి వనరులు వివిధ జలాశయాలకు క్యాచ్‌మెంట్‌లో భాగమని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. వాస్తవానికి, ఇది ప్రాజెక్టు ప్రాంతాల సమీపంలోని ఆదివాసీల నీటి భద్రతపై మాత్రమే కాకుండా, మైదానాల్లోని రైతులపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ప్రాజెక్టుల నీటి డిమాండ్ల విస్తృత ప్రభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుతం, ఆరు ప్రాజెక్టులకు సంబంధించిన డి.పి.ఆర్ లు తుది దశలో ఉన్నాయి. అయితే కురుకుట్టి, కర్రివలస ప్రాజెక్టులు పొరుగు రాష్ట్రమైన ఒడిశాతో సరిహద్దు వివాదాల రూపంలో అదనపు అడ్డంకులను ఎదుర్కొంటు న్నాయి. అయితే బలమైన స్థానిక వ్యతిరేకత కారణంగా యెర్రవరం ప్రాజెక్టు పనులు తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి. మిగిలిన ప్రాజెక్టు బాధిత ఆదివాసీ తెగలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కార్పొరేట్ కంపెనీల దోపిడికి అడ్డుగా వున్న రాజ్యాంగ హక్కులను సవరించాలని, రద్దు చేయాలని బాహాటంగానే ప్రభుత్వ పెద్దలు చేస్తున్న వ్యాఖ్యలపై ఆదివాసీలు అప్రమత్తంగా వుండి చట్టాలు, హక్కులను రక్షించుకోవాలి.

## ఇసుక దోపిడీ కోసం గుండ్లకమ్మ గేట్లు ధ్వంసం

బాపట్ల,ఇసుక దోపిడీ కోసమే వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో గుండ్లకమ్మ గేట్లను విరగొట్టారని అంటూఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సంచలన ఆరోణలు చేశారు.. అధికారంలో ఉండగా వైకాపా నేతలు అనేక అరచకాలకు పాల్పడ్డారని మండిపడ్డారు.బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. బల్లికురవలో ఈర్ల గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం సాగునీటి సంఘాల కమిటీ-సభ్యులతో మాట్లాడి దిశానిర్దేశర చేవారు.. ఎండాకాలం పూర్తి అయ్యేలోపు కాలువ పూడికతీత, మరమత్తులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక, ఈ సందర్భంగా మంత్రి గొట్టి పాటి మాట్లాడుతూ.. వ్యవసాయం సీజన్ నాటికి పంట కాలువలు రైతులకు అందుబాటు-లో ఉండేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.. గుండ్లకమ్మ చుట్టు- పక్కల గ్రామాల ప్రజలతో పాటు- రైతాంగాన్ని కాపాడుకుంటాం అన్నారు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక దోపిడీ కోసమే గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లను విరగొట్టారని ఆరోపించారు.. గుండ్లకమ్మ నుంచి వైసీపీ నేతలు కోట్లాది రూపాయిల ఇసుక దోపిడీ చేశారని విమర్శించారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరమత్తుల కోసం నిధులు కేటాయించింది. గుండ్లకమ్మ ప్రాజెక్టులో 3 టీ-ఎంసీల నీటిని నిల్వ చేసి 20 లక్షల చేపపిల్లలను వదిలామని వెల్లడించారు.. జలాశయం మీద ఆధారపడి జీవించే వారికి జీవనోపాధి కలిస్తున్నాం అని మంత్రి అన్నారు..

## దమ్ముంటే ఆ ఎంపి ఎవరో చెప్పండి

విజయవాడ,సెంట్రల్ యూనివర్సిటీ సమీపంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కాకరేపుతోంది.. మాజీ మంత్రి కేటీఆర్ ఈ వ్యవహారంలో కాంగ్రెస్, బీజేపీపై ఆరోపణలు గుప్పించారు.. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూనే.. ఓ బీజేపీ ఎంపీకి కూడా సంబంధం ఉందని కామెంట్ చేశారు.. ఈ నేపథ్యంలో కేటీఆర్‌పై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ఫైర్ అయ్యారు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆమె.. కేటీఆర్ కి దమ్ముంటే ఆ ఎంపీ పేరు చెప్పాలి కదా అని సవాల్ చేశారు.. ఎవరి గురించి మాట్లాడాడో చెప్పకుండా... ఒక ఎంపీ అని గాలివార్త చెప్తే సరిపోదు కదా. అని నిలదీశారు.. దక్షిణాదిపై భారతీయ జనతా పార్టీ ఫోకస్ పెట్టింది.. తెలంగాణలో మొన్న ఎన్నికల్లో విజయవంతంగా ఎనిమిది మంది ఎంపీలు గెలిచాం... ఆంధ్రాలో కూడా బీజేపీ ఎంపీలు గెలిచారన్న డీకే అరుణ.. ఆంధ్రలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంది... తెలంగాణలో బీజేపీ స్వతంత్రంగా అధికారంలోకి రాబోతుందన్నారు.. ఏపీలో కూడా మళ్లీ ఎన్డీఏ అధికారంలోకి వస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇద్దరూ ఒక్కటే కాబట్టి... తమిళనాడులో జరిగిన స్టాలిన్ సమావేశానికి వెళ్లారని విమర్శించారు.. తమిళనాడులో తండ్రీ కొడుకులే ఉండాలనుకుంటున్నారు కాబట్టి.. ఏదేదో కామెంట్ చేస్తున్నారు అంటూ ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు..

## సర్వే... సంచలనం!

విజయవాడ:ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ఎమ్మెల్యేలపై ఒక ప్రముఖ సర్వే సంస్థ ఐఐటీ నిపుణులతో రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేయించింది. సర్వేలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. కేవలం పది నెలల పాలన పూర్తి చేసుకుంటున్న కూటమిలోని ప్రజాప్రతినిధులపై ఏకంగా 70 శాతం వ్యతిరేకత ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల సంఖ్య అక్షరాలా 71. ఈ నివేదిక కూటమి గుండెల్లో రైళ్లు పరుగెత్తించేలా వుంది.మద్యం, ల్యాండ్, రియల్ ఎస్టేట్ మాఫియాలుగా ప్రజాప్రతినిధులు తయారయ్యారు. సర్వేలో భాగంగా వెలుగు చూసిన సంచలన విషయాలు ఇలా ఉన్నాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు నేరుగా రియల్ ఎస్టేట్, ల్యాండ్ మాఫీయా అవతారం ఎత్తారు. నియోజకవర్గాల్లో వివిధ సంస్థలు, వ్యక్తుల నుంచి భారీ మొత్తంలో లంచం రూపంలో డబ్బు గుంజుతున్నారు. మైనింగ్ మాఫియా, కాంట్రాక్టర్ల నుంచి ముక్కు పిండి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. అలాగే చిన్నచిన్న వ్యాపారస్తులు, ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కూడా డబ్బు దోస్తున్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులు కేడర్‌కు అందుబాటులో వుండడం లేదు. అలాగే ప్రజా సమస్యల్ని గాలికి వదిలేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి 164 అసెంబ్లీ సీట్లను గెలుచుకుని అపరిమితమైన అధికారాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. అయితే పది నెలల్లోనే సీన్ రివర్స్ అవుతోంది.కేవలం 30 శాతం మాత్రమే పాజిటివిటీ ఉన్న 71 మంది ఎమ్మెల్యేల వివరాలు%౾% ఉమ్మడి జిల్లాల వారీగా ఇలా ఉన్నాయి.శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పాలకొండ (ఎస్టీ), పలాస, పాతపట్నంబీ విజయనగరం జిల్లాలో గజపతినగరం, నెల్లిమర్ల, సాలూరు (ఎస్టీ), పార్వతీపురం (ఎస్సీ), కురుపాం (ఎస్టీ)బీ విశాఖపట్నం జిల్లాలో యలమంచిలి, పెందుర్తి , విశాఖపట్నం (సౌత్), నర్సీపట్నం, అనకాపల్లిబీ ఈస్ట్ గోదావరి జిల్లాలో తుని, రాజానగరం, పి.గన్నవరం (ఎస్సీ), కాకినాడ రూరల్ , రంపచోడవరం (ఎస్టీ), రాజోలు (ఎస్సీ), కొత్తపేట, రామచంద్రాపురం బీవెస్ట్ గోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, నరసాపురం, ఉంగటూరు, నిడదవోలు, పోలవరం (ఎస్టీ), చింతలపూడి (ఎస్సీ)బీ కృష్ణా జిల్లాలో విజయవాడ వెస్ట్, తిరువూరు (ఎస్సీ), కైకలూరు, నూజివీడు, నందిగామ (ఎస్సీ)బీ గుంటూరు జిల్లాలో పెదకూరపాడు, నర్సారావుపేట, గుంటూరు వెస్ట్ , తెనాలి, బాపట్ల, గురజాలప్రకాశం జిల్లాలో కందుకూరు, మార్కాపురం, చీరాల, గిద్దలూరుబీ నెల్లూరు జిల్లాలో కావలి, సర్వేపల్లి, సూళ్లూరుపేట (ఎస్సీ), ఉదయగిరిబీ వైఎస్సార్ కడప జిల్లాలో కడప, రాయచోటి, కోడూరు (ఎస్సీ)బీ కర్నూలు జిల్లాలో పత్తికొండ, ఆళ్లగడ్డ, పాణ్యం, ఆదోని, కర్నూలు, డోన్, నందికొట్కూరు (ఎస్సీ)బీఅనంతపురం జిల్లాలో మడకసిర (ఎస్సీ), పెనుగొండ, కదిరి, గుంతకల్, అనంతపురం అర్బన్, సింగనమల (ఎస్సీ), కల్యాణదుర్గంబీ చిత్తూరు జిల్లాలో శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి, నగరి, గంగాధరనెల్లూరు (ఎస్సీ), సత్యవేడు (ఎస్సీ) నియోజకవర్గాల్లో కూటమి ప్రజాప్రతినిధులు 70 శాతం ప్రజావ్యతిరేకత కలిగి ఉండడం కూటమికి షాక్ తెప్పించేలా వుంది.అలాగని మిగిలిన నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులపై ప్రజాదరణ ఉందని అర్థం కాదని ఆ సర్వే సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. 30-40 శాతం మధ్య ప్రజాదరణ ఉండి, 60 నుంచి 70 శాతం లోపు వ్యతిరేకత కలిగిన ప్రజాప్రతినిధులు కూడా చాలా మంది ఉన్నట్టు తెలిపారు. ఏది ఏమైనా ఈ సర్వే నివేదికను కూటమి సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం వుంది. కాదు, కూడదని కొట్టి పారేస్తే, దారుణ ఓటమికి సిద్ధమవుతున్నారని పరిగణించాల్సి వుంటుంది.

### తనిఖీల్లో హాష్ ఆయిల్ పట్టివేత


హైదరాబాద్,నగరంలో రాచకొండ పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భారీగా హాష్ అయిల్‌ను పట్టుకున్నారు. హాష్ అయిల్‌ను తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు- భువనగిరి రూరల్ పోలీసులు తెలిపారు. ఇద్దరి వ్యక్తుల దగ్గరి నుంచి హాష్ అయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా నుంచి హైదరాబాద్‌కు హాష్ అయిల్‌ను వాహనంలో తరలిస్తున్న సమయంలో

# కేటీఆర్ రాజేసిన కాక.. బీజేపీలో ఉలికిపాటు



హైదరాబాద్,కంచ గచ్చిబౌలి భూ వివాదంలో మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ఆరోపణలు బీజేపీని ఉలికిపాటుకు గురిచేస్తున్నాయని అంటున్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్.. రూ. 10 వేల కోట్ల స్కాం జరిగేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ బీజేపీ ఎంపీ సహకరించారని రెండు రోజుల క్రితం సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ బీజేపీ ఎంపీ ఎవరో కేటీఆర్ బహిర్గత పరచకపోవడంపై చర్చ జరుగుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకరిస్తున్న బీజేపీ ఎంపీ ఎవరో చెప్పాలంటూ కమలం నేతలు సవాల్ విసురుతున్నారు. అయితే సమయం వచ్చినప్పుడు ఆ పేరు బయటపెడతానంటూ కేటీఆర్ తప్పించుకుంటున్నారు. దీంతో కేటీఆర్ బురద పూస్తే తాము కడుగు కోవాల్సివస్తోందని కమలం నేతలు మండిపడుతున్నారు. కేటీఆర్ కు దమ్ముంటే బీజేపీ ఎంపీ ఎవరో చెప్పాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేస్తున్నా, బీఆర్ఎస్ సౌండ్ చేయడం లేదు. దీంతో వ్యూహాత్మకంగానే కేటీఆర్ బీజేపీని ఇరుకున పెట్టారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.తెలంగాణలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉండగా, వీరిలో కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన ఆరుగురిలో ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురం అర్వింద్, జి.నగేశ్ ఉన్నారు. ఈ ఆరుగురు ఎంపీల్లో ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ సైలెంటుగా వ్యవహరిస్తుంటారు. తన పనేదో తాను చేసుకుంటారు. కానీ, మిగిలిన ఐదుగురు ఎంపీలు రాష్ట్ర రాజకీయాల్లో చాలా యాక్టివ్ గా ఉంటారు. ఈ ఐదుగురు ఒకరిని మించి మరొకరు రాజకీయంగా పావులు కదుపుతుంటారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డికి సహరించిన వారు ఈ ఐదుగురులో ఒకరి అయి ఉంటారని చర్చ జరుగుతోంది. అయితే రాజకీయ వర్గాలు మాత్రం కేటీఆర్ వ్యూహాత్మకంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ఇరుకున పెట్టేందుకే బీజేపీ ఎంపీ ఉన్నారంటూ గుడ్డ కాల్చి ముఖాన వేశారంటున్నారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్, బీజేపీకి మధ్య స్నేహ బంధం ఉందని కాంగ్రెస్ ప్రచారం చేసి లబ్ధి పొందింది. ఇప్పుడు ఆ వ్యూహాన్ని తిప్పికొట్టడంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయనే ప్రచారం చేసేందుకు బీఆర్ఎస్ చూస్తోందని అంటున్నారు. నిజంగా రేవంత్, బీజేపీ ఎంపీ మధ్య లింకు ఉంటే ఆ పేరు అప్పుడే బయటపెట్టేవారు కదా? అనే ప్రశ్న వినిపిస్తోంది. అయితే రేవంత్ రెడ్డికి సహకరిస్తున్న బీజేపీ ఎంపీ సమాచారం తమ వద్ద పక్కాగా ఉందని, సమయం వచ్చినప్పుడు బయటపెడతామని బీఆర్ఎస్ ఢంకా భజాయించి మరీ చెబుతోంది. దీంతో కేటీఆర్ రేపిన కాక బీజేపీని రాజకీయంగా ఇబ్బంది పెడుతోందని అంటున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు బీజేపీ ఎలాంటి ప్రతివ్యూహం పన్నుతుందనేది ఆసక్తి రేపుతోంది.

# టీడీపీతో విజయసాయిరెడ్డి సెటిల్మెంట్.. ఇక వారికి మూడినట్లేనా?



అమరావతి,రాజకీయాల్లో శాశ్వత శత్రువులు.. శాశ్వత మిత్రులు ఉండరనే సామెతను నిజం చేయబోతున్నారు వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి. టీడీపీతో రాజకీయ వైరమే ప్రధాన ఆయుధంగా రాజకీయాల్లోకి వచ్చిన విజయసాయిరెడ్డి ఇప్పుడు ఆ పార్టీతో సఖ్యత కోరుకుంటున్నారట.. రాజకీయాలకు విరామం ప్రకటించిన తాను.. ఒట్టు తీసి గట్టుమీద పెట్టాలని, మళ్లీ రాజకీయాల్లోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నారని ప్రచారం జరుగుతోంది. తన రాజకీయ పునరాగమనానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా అధికార పార్టీతో డీల్ సెట్ చేసుకునేలా విజయసాయిరెడ్డి పావులు కదుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వైసీపీ నేత, మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి రాజకీయ విరామానికి సెలవు ప్రకటిస్తారని కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. విజయసాయిరెడ్డిని బీజేపీలోకి తీసుకుని, మళ్లీ రాజ్యసభకు పంపడమే కాకుండా, ఆయన ద్వారా వైసీపీలోని ముఖ్య నేతలను బీజేపీలోకి తేవాలని ఢిల్లీ బీజేపీ పెద్దలు ప్లాన్ చేస్తున్నట్లు పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తోంది. ఈ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలంటే ముందుగా కూటమిలోని ప్రధాన పార్టీలను ఒప్పించాలని కమలం పెద్దలు ఆలోచిస్తున్నారట. ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఈ విషయం చర్చించేందుకు ఢిల్లీలోని బీజేపీ హైకమాండ్ ఫోకస్ చేసినట్లు చెబుతున్నారు. విజయసాయిరెడ్డిని చేర్చుకోవడం ద్వారా వైసీపీకి చెక్ పెట్టొచ్చని.. గత ప్రభుత్వంలోని కొన్ని కీలక కుంభకోణాల విషయంలో ఆధారాలు లభించేలా విజయసాయిరెడ్డి సహకరిస్తారని ప్రచారం జరుగుతోంది.ఇప్పటికే వైసీపీ నుంచి బయటకు వచ్చిన విజయసాయిరెడ్డి.. కాకినాడ సీపోర్టు వాటాల బదిలీ విషయమై నమోదైన కేసు విచారణ సందర్భంగా లిక్కర్ స్కాంపై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా తగిన సమయంలో మరిన్ని వివరాలు వెల్లడిస్తానని విజయసాయిరెడ్డి చేసిన ప్రకంపనలు పుట్టించింది. ఇలా విజయసాయిరెడ్డి ప్రకటించడం వ్యూహాత్మకంగా భావిస్తున్న పరిశీలకులు.. అప్పుడే టీడీపీతో విజయసాయిరెడ్డి చర్చలు కొనసాగించినట్లు అనుమానిస్తున్నారు. ఇటీవల కాలంలో లిక్కర్ స్కాం కేసు దర్యాప్తు వేగవంతం కావడం, నిందితులు తప్పించుకునే మార్గాలు అన్వేషిస్తుండటంతో విజయసాయిరెడ్డి ప్రాధాన్యం పెరిగిందని అంటున్నారు.తన ప్రకటనల ద్వారా ప్రభుత్వంతో సఖ్యత కోరుకుంటున్న విజయసాయిరెడ్డి గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న అనేక అంశాల్లో సర్కారుకు సహకరిస్తానని భరోసా ఇస్తున్నారని అంటున్నారు. ఇదే సమయంలో బీజేపీ కల్పించుకుని కీలకమైన లిక్కర్ స్కాంను సీబీఐ, ఈడీతో దర్యాప్తు చేయించాలని ప్రతిపాదిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే గతంలో విజయసాయిరెడ్డి వ్యవహరించిన వైఖరి కారణంగా టీడీపీ నుంచి ఇంకా ఎలాంటి సంకేతాలు రావడం లేదని చెబుతున్నారు. వైసీపీలో ఉండగా జుగుప్సాకరమైన భాషను వాడిన విజయసాయిరెడ్డిని కూటమిలోకి తెస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని టీడీపీ పెద్దలు సందేహిస్తున్నారు. అయితే ముందుగా ఆయన గత ప్రభుత్వంలో ప్రజాధనం దుర్వినియోగం చేసిన కేసులకు సహకరిస్తే, విజయసాయిరెడ్డిపై ఉన్న అభిప్రాయంలో మార్పు వస్తోందని అంటున్నారు. దీంతో విజయసాయి–టీడీపీ మధ్య చర్చలు కొంత ముందుకు, మరికొంత వెనక్కు వస్తున్నట్లు చెబుతున్నారు. అయితే బీజేపీ పెద్దల ఆసక్తి మేరకు విజయసాయిరెడ్డి ఆ పార్టీ కండువా త్వరలోనే కప్పుకోవచ్చని అంటున్నారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో ఆరోపణలు ఎదుర్కొన్న వారు టెన్షన్ పడుతున్నట్లు చెబుతున్నారు.వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగిన విజయసాయిరెడ్డి గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా తన పర్సనల్ ఎక్స్ అకౌంటు ద్వారా వివాదాస్పద, అనుచిత రాతలు రాసేవారని విజయసాయిరెడ్డిపై టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. అయితే రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో? ఎప్పుడు ఎవరి అవసరం ఉంటుందో ఊహించలేం కనుక విజయసాయిరెడ్డి సహకారంతో వైసీపీని తీవ్రంగా దెబ్బతీసే రాజకీయ వ్యూహానికి టీడీపీ పదును పెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# అంబేద్కర్ పుస్తకాలు నేటికీ ప్రామాణికం..ప్రధాని కాకుండా అడ్డుకున్నదెవరు?



న్యూఢిల్లీ,రాజ్యాంగ పరిషత్తు సభ్యుడిగా, మంత్రివర్గ సభ్యుడిగా అంబేద్కర్ చేసిన కృషి అనన్య సామాన్యమైనది. ఆయన రాజ్యాంగ భారాన్నంతా ఒక్కడే తన భుజస్కంధాలపై మోసాడు. రాజ్యాంగ పరిషత్తు సభ్యుడుగా అంబేద్కర్ విశేషంగా శ్రమించి రాజ్యాంగం రచించటం ఆయన శేష జీవితంలో ప్రముఖమైన ఘట్టం. నాటి కేంద్రమంత్రి టి.టి కృష్ణమాచారి ఒకమారు రాజ్యాంగ పరిషత్తులో మాట్లాడుతూ 'రాజ్యాంగ రచనా సంఘంలో నియమితులైన ఏడుగురిలో ఒకరు రాజీనామా చేశారు. మరొకరు మరణించారు. వేరొకరు అమెరికాలో వుండి పోయారు. ఇంకొకరు రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులయ్యారు. ఉన్న ఒక్కరిద్దరు ఢిల్లీకి దూరంగా ఉన్నారు. అందువల్ల భారత రాజ్యాంగ రచనా భారమంతా డా.అంబేద్కర్ మోయవలసి వచ్చింది. రాజ్యాంగ రచన అత్యంత ప్రామాణికంగా వుంటుందనటంలో ఏలాంటి సందేహం లేదన్నాడు. కేంద్ర మంత్రిమండలిలో న్యాయశాఖ మంత్రిగా వుండి 1951 అక్టోబరులో మంత్రి పదవికి రాజీనామా చేశాడు. ముఖ్యంగా సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుడుతూ అంబేద్కర్ పెక్కు గ్రంథాలు వ్రాశాడు. 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ', 'ప్రొవిన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా', 'ది బుద్దా అండ్ కార్ల్ మార్క్స్', 'ది బుద్ధా అండ్ హిజ్ ధర్మ' ప్రధానమైనవి. ప్రసిద్ధ రచయిత బెవెర్లి నికొలస్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశపు ఆరుగురు మేధావులలో ఒకరు అని ప్రశంసించాడు. మహామేధావిగా, సంఘసంస్కర్తగా, న్యాయశాస్త్రవేత్తగా, కీర్తిగాంచిన డాక్టర్ భీమారావ్ అంబేద్కర్ 1956 డిసెంబర్ 6 న కన్ను మూశాడు. భారత రాజ్యాంగ శిల్పిగా, ప్రజాస్వామ్య పరిరక్షకునిగా, సంఘసంస్కర్తగా, మహామేధావిగా విఖ్యాతుడిగా పేరొందారు. అంబేద్కర్ స్మృతికి నివాళులర్పిస్తూ, ఆ మహనీయునికి ' భారతరత్న ' అవార్డును భారత ప్రభుత్వం ప్రకటించింది. ఇక లోతుల్లోకి వెళితే.. అంబేద్కర్ ఎదుర్కొన్న వర్ణవివక్ష అంతాఇంతా కాదు. ఆయన జీవితమే అనుభవ పాఠంగా మారింది. స్వాతంత్ర్యానంతరం అంబేద్కర్‌ను ప్రధానిని చేసివుంటే దేశ పరిస్థితి మరోలా ఉండేది. గాంధీ సైతం ఈ విషయంలో అంబేద్కర్‌ను పక్కన పెట్టారనే చెప్పాలి. నెహ్రూ ప్రభావంతో ఆయన సుభాస్ చంద్రబోస్‌ను, స్వాతంత్ర్యానంతరం అంబేద్కర్‌ను పక్కన పెట్టారు. 1927లో అంబేద్కర్ 'బహిష్కృత భారతి' అనే మరాఠి పక్ష పత్రిక ప్రారంభించాడు. ఆ పత్రికలో ఒక వ్యాసం వ్రాస్తూ అంబేద్కర్ ఇలా అన్నాడు. బాలగంగాధర్ తిలక్ గనుక అంటరానివాడుగ పుట్టివుంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు'అని ఉండేవాడు కాదంటాడు. అస్పృశ్యతా నివారణే నా ధ్యేయం, నా జన్మ హక్కు' అని ప్రకటించి ఉండేవాడని వ్రాశాడు. అంటే ఆనాడు అంబేద్కర్ కులతత్వవాదుల బాధను ఎంతగా అనుభవించాడో దీన్ని బట్టి తెలుసుకోవచ్చు. అయితే అంటరాని వారుగా చూడబడుతున్న కులాల వారు తమ ఆత్మగౌరవాన్ని త్యాగం చేస్తూ సమాజ బాగు కోసం తాము చేసే వృత్తులను చేస్తున్నారని అటువంటి వారిని ఇతర వర్ణాల వారందరూ గౌరవించాలని పేర్కొన్నారు. ఇలా కుల, అంటరానితన సమస్యకు గాంధీ సామాజిక, సాంస్కృతిక పరిష్కారం చూపగా అంబేద్కర్ ఈ విషయంలో గాంధీతో విభేదించాడు. ఎందుకంటే దాని పర్యవసానాలు ఎలా ఉన్నాయో ఈనాడు చూస్తున్నాం. దీనిని ఆనాడే అంబేద్కర్ మహాశయుడు ఊహించి ఉంటాడు. అందుకే ఆనాడే గాంధీతో అంబేద్కర్ విభేదించాడు. నిజానికి ఆనాడే గాంధీ చిత్తశుద్ధితో ప్రయత్నం చేసివుంటే ఇవాళ సమాజం ఇంకెంతో ముందుకు..అంటే అంబేద్కర్ ఆశించిన విధంగా పోయి వుండేది. గాంధీజీతో అనేక విషయాలలో విభేదించినా తాను మతం మారదలచుకున్నప్పుడు మాత్రం దేశానికి చాలా తక్కువ ప్రమాదకరం అయిన దానినే ఎన్నుకుంటానని ప్రకటించాడు. బౌద్ధం భారతీయ సంస్కృతిలో భాగమని, ఈ దేశ చరిత్ర సంస్కృతులు, తన మార్పిడివల్ల దెబ్బతినకుండా చూచానన్నాడు. హిందువుగా పుట్టిన అంబేద్కర్ హిందువుగా మరణించలేదు. నిరంతర కృషితో సాగిన ఆయన జీవితం ఉద్యమాలకు ఊపిరిపోసింది. నిజానికి ఆయన అనుభవించిన కులవివక్ష కారణంగానే పట్టుదలతో సమాజంలో ముందుకు రాగలిగాడు. ఆయన అనుసరించిన లేదా ప్రవచించిన మార్గం సాకారం కావాలంటే దళితుల కు అధికారం దక్కాలి. వారు ధైర్యంగా పాలకులుగా నిలబడగలగాలి. అగ్రవర్ణాల పెత్తనంలో వారు మగ్గినంత కాలం ఈ దేశంలో కులవ్యవస్థ పోదు. కులరహిత సమాజం కోసం గట్టిగా పోరాడాలి. భారత సమాజంలో ఇంకా కులవ్యవస్థను ప్రోత్సహించే చర్యలకు మంగళం పాడాలి. అప్పుడే ఆర్థిక అసమానతలు లేని భారత్ ఉద్భవిస్తుంది. అదే అంబేద్కర్‌కు మనమిచ్చే నివాళి అవుతుంది.

# రాజకీయ జోక్యంతో అస్తమించిన రవి కిరణాలు!



చెన్నై:రాజకీయాలు మంచిదే. కానీ, వాటిని కొంత వరకు మాత్రమే వినియోగించుకోవాలి. హద్దు మీరితే.. అదుపు తప్పితే.. కనీసం పలకరించేవారు కాదు కదా.. పోనీలే పాపం అనిఅనుకునే వారు కూడా ఉండరు. ఇప్పుడు తమిళనాడు గవర్నర్ రాఘవేంద్ర నారాయణ రవి(ఆర్.ఎన్.రవి) వ్యవహారం ఇలానే ఉంది. తాజాగా సుప్రీంకోర్టు అంటిన తలతో ఆయన సిగ్గు పడుతున్నారో లేదో తెలియదు కానీ.. దేశవ్యాప్తంగా గవర్నర్ వ్యవస్థ అయితే.. సిగ్గు పడుతోంది.గవర్నర్‌గా తన విహిత ధర్మాన్ని నెరవేర్చకుండా.. రాజకీయ ప్రాపు కోసం.. పెద్దల మెప్పు కోసం వేసిన అడుగులు.. రవినే కాదు.. గవర్నర్ వ్యవస్థనే కాదు.. ఏకంగా దేశంలో తొలిసారి సాక్షాత్తూ రాష్ట్రపతికి కూడా.. సుప్రీంకోర్టు లక్ష్మణ రేఖలు నిర్దేశించే పరిస్థితి వచ్చింది. ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వాలకు ప్రాధాన్యం లేకుండా.. వ్యవహరించిన గవర్నర్‌గా ఆయన చరిత్రలో మరో పేజీ సృష్టించారు. చిత్తు కాయితాలు అంటూ నిండు సభలో చేసిన బిల్లులను ఆయన తృణీకరించిన తీరు నిజంగా సిగ్గుమాలిన తనమంటూ.. తమిళ పత్రికలు ఏనాడో ఘోషించాయి.అయితే.. రవిమాత్రమేనా? అంటే.. కాదు. ఈ దేశంలో ఆది నుంచి కూడా గవర్నర్ వ్యవస్థ రాజకీయ సంక రంతో ఏనాడో భ్రష్టుపట్టింది. అయితే.. ఇక్కడ నాటికి నేటికి తేడా ఉంది. గతంలో రాజకీయ నేతలు నేరుగా గవర్నర్‌లు గా వచ్చేవారు. కాబట్టి.. తమ అనుకూల పార్టీకి కార్పెట్లు పరిచారంటే అర్థం ఉంది. కానీ, అలా కాకుండా.. ఐఏఎస్, ఐపీఎస్, న్యాయమూర్తులు గా ఏలుబడి సాగించిన వారు కూడా.. గవర్నర్‌లు గా మారాక.. కేంద్ర సర్కారు పార్టీకి అనుబంధం కార్యాలయంగా రాజ్‌భవన్‌లను మార్చేసిన తీరు.. నవ్విపోదురుగాక.. అన్నట్టుగా మారిపోయింది.రవి గురించి చెప్పాల్సి వస్తే.. ఆయన ప్రొఫైల్ చిన్నదేమీ కాదు. ఘనతర నేపథ్యం.. పటుతర సారథ్యం ఉన్న ఉ న్నతస్థాయి ఐపీఎస్ అధికారి. కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో సహా సీబీఐలోనూ.. నిఖార్సయిన అధికా రిగా పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే నాగాలాండ్‌లో నాగాలతో ఒడంబడిక చేసుకుని.. విధ్వంసాల కు చెక్ పెట్టిన ఘన నేపథ్యం కూడా ఆయన సొంతం. అవినీతి, లంచాలు ఎరుగని ఉన్నతాధికారిగా ఆయన రికార్డులు చెబుతున్నాయి.అలాంటి రవి.. గవర్నర్ గా నాగాలాండ్, మేఘాలయలో పనిచేసిన తర్వాత తమిళనాడుకువచ్చారు. అంతే.. ఆయనను బీజేపీ ఆవహించి.. ప్రజాస్వామ్య విలువలు, ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వం విలువలను కూడా ఆయన మరిచిపోయారు. సుప్రీంకోర్టు చివాట్లతో తల బొప్పికట్టి.. రాజ్‌భవన్ కు లోపల వైపు తాళాలు వేసుకుని కుమిలి పోతున్నారు.ప్రఖ్యాత రచయిత్రి రంగ నాయకమ్మ చెప్పినట్టు.. జాతి ఛండాలుల కంటే.. జ్ఞాన ఛండాలులతోనే సమాజానికి చేటు అన్న మాట ఇప్పుడు జోరుగా వినిపించేలా చేశారు.

# సందిగ్ధంలో ఎలివేటెడ్!



హైదరాబాద్,నార్త్ సిటీ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు భూములు ఇవ్వాలంటే తమ శరతులు అంగీకరించాల్సిందేనని రక్షణ శాఖ చెబుతోంది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట్, ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం మార్గాల్లో దాదాపు 18 పొడవైన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును చేపట్టేందుకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. ఈ రక్షణ శాఖ భూములతోపాటు, ప్రైవేటు ఆస్తుల సేకరణకు చర్యలు చేపట్టారు.భూసేకరణలను బాధ్యత మేడ్చల్, హైదరాబాద్ జిల్లా యంత్రాంగానికి అప్పగించింది. అయితే ఇటీవల భూములు బదలాయింపునకు తీసుకోవాల్సిన చర్యలపై హెచ్ఎండీఏ, రక్షణ శాఖల మధ్య జరిగిన సమావేశంలో%ూ% రక్షణ శాఖ అధికారులు పలు షరతులను ప్రతిపాదించినట్లుగా తెలిసింది. వాటికి హెచ్ఎండీఏ ఆమోదిస్తే గానీ, భూముల బదలాయింపు ప్రక్రియ చేపట్టేది లేదని తెలిసింది. ఇందులో ప్రధానంగా రక్షణ శాఖ కోల్పోతున్న ఆస్తులకు భూములు ఇవ్వడంతోపాటు, కూల్చివేసే నిర్మాణాలను కూడా కట్టి ఇవ్వాల్సిందేనంటూ షరతులు పెట్టినట్లుగా వెల్లడైంది.ఈ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. రక్షణ శాఖ సూత్రప్రాయంగా మొదట భూములు ఇచ్చేందుకు అంగీకరించింది. కానీ ఆ తర్వాత భూములు బదలాయింపునకు పెడుతున్న కొర్రీలతో కొత్త సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికే కోల్పోతున్న భూమికి పరిహారంగా ఒకేచోట అంతకు సమానమైన విలువైన భూమిని అందించాలనే నిబంధనతో ఇప్పటికీ భూసేకరణ ముందుకు సాగలేదు. తాజాగా ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చేందుకు రక్షణశాఖ అధికారులు పెడుతున్న షరతులు ప్రాజెక్టు పురోగతిని మరింత సందిగ్ధంలో పడవేసినట్లు తెలపుతోంది.

### రక్షణ శాఖ విధించిన శరతులు..!

భూములు బదలాయింపునకు రక్షణ శాఖ విధించిన షరతుల్లో ప్రధానంగా జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ మార్గంలో రక్షణ శాఖకు చెందిన రెండు భారీ రిజర్వాయర్‌లు, ప్రాంతాలకు చెందిన రెండు భారీ రిజర్వాయర్లు కట్టడాలు, భవంతులు కోల్పోతున్నట్లుగా తెలిసింది. వీటికి పరిహారంతోపాటు, అదే తరహాలో వేరేచోట వాటిని నిర్మించాలనే ప్రతిపాదన తెరమీదకు వచ్చినట్లు తెలిసింది. పరిహారంతోపాటు, తాజా ప్రతిపాదనలకు అంగీకరిస్తేనే ప్రాజెక్టుకు అవసరమైన 110 ఎకరాలకు పైగా భూమిని ఇవ్వడానికి రక్షణ శాఖ ప్రతిపాదనతో హెచ్ఎండీఏ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

### వెడల్పు తగ్గించాలంటున్న స్థానికులు

ఇప్పటికే ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఆస్తుల సేకరణ వ్యవహారం కోర్టుల్లో చిక్కుకుని ముందుకు సాగడం లేదు. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి 4 నెలలు గడుస్తున్నా 50 శాతం కూడా ఆస్తుల సేకరణ పూర్తికాని పరిస్థితి ఉంది. ఇక ప్రాజెక్టు వెడల్పును 200 ఫీట్ల నుంచి 100–150 ఫీట్‌లకు తగ్గించాలని, మార్కెట్ రేటు ఆధారంగా పరిహారం చెల్లిస్తేనే భూములను ప్రైవేట్ వ్యక్తులు తేల్చి చెప్పడం ప్రభుత్వానికి కొత్త సమస్యగా మారింది.

# వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాల్సిందే..సమైక్యతా శంఖారావం లో వక్తలు



ఎన్టీఆర్ : భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్న మన దేశంలో ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించి తన పబ్బం గడుపుకుంటున్న పాలక భాజపా ప్రభుత్వానికి కాలంచెల్లె రోజులు దగ్గర పడ్డాయని చరిత్రలో హిట్లర్ కు పట్టిన గతే పడుతుందని, పలువురు వక్తలు హెచ్చరించారు. పార్లమెంట్ లో ఏకపక్షంగా ఆమోదించిన వక్ఫ్ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.మత సామరస్యం కోరుతూ సొసైటీ ఫర్ కమ్యునల్ హార్మని జాతీయ కమిటీ ఆద్వర్యంలో విజయవాడలోని స్థానిక సిద్ధార్థ అకాడెమీ ఆడిటోరియం లో సమైక్యతా శంఖారావం సదస్సు నిర్వహించారు. రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్ ఖదీ, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, తో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అజీజ్ పాషా, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసి రెడ్డి, హార్మనీ జాతీయ ఉపాధ్యక్షులు కే విజయరావు, యూపి మాజీ మంత్రి మొయిద్ అహ్మద్ రైతు ఉద్యమ నేత వడ్డే శోభనాద్రిస్వరరావు , సీనియర్ జర్నలిస్టు ఆనంద్ వర్ధన్ తదితరులు వక్తలు గా పాల్గొన్నారు.తొలుత మహాత్మాగాంధీ జ్యోతిరావు పులే, బి ఆర్ అంబేద్కర్, మౌలానా అబుల్ కలామ్ చిత్ర పటాలకు పూలదండలతో నివాళులు అర్పించారు. సమైక్యతా శంఖారావం సూచికగా అభివాదం చేశారు.అనంతరం ఇమ్రాన్ ప్రసంగిస్తూ వక్ఫ్ బిల్లు ఆమోదించి పార్లమెంట్ లో మోడీ అమిత్ షా లు చీకటి చట్టాన్ని చేశారని, గతంలో ఇలాగే పెద్ద నొట్ల రద్దు, జి ఎస్ టి, కార్పొరేట్ లకు ప్రయోజనం చేకూరే అనేక చట్టాలు తెచ్చారని అన్నారు. నిరుద్యోగ సమస్య, మహిళా సాధికారత, రైతుల సంక్షేమం ప్రక్కన పెట్టీ ప్రజల విశ్వాసాలను ఆసరాగా చేసుకుని హిందూ ముస్లిం, క్రైస్తవ మతాల మధ్య చిచ్చు పెడుతూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సుప్రీం కోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ కార్పొరేట్ మీడియాను స్వంత చానల్స్ ను ఉపయోగించి భాజపా ఆరెస్సెస్ లు తన పబ్బమ్ గడుపుకుంటూ ఉన్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రగతిశీల భావాలు సామాజిక దృక్పథం మత సామరస్యం కోరుకునే ప్రతి ఒక్కరూ తమ సమాచార ప్రసార మాధ్యమాల్లో ముందు భాగాన ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ రాజ్యసభ సభ్యుడు అజీజ్ పాషా , సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని ఉప ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న పవన్ కళ్యాణ్ ఇటీవలి కాలంలో మతాల మధ్య ప్రజల మధ్య రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేస్తూ ఉన్నారని ఎద్దేవా చేశారు. విద్యా వైద్యం నిరుద్యోగం, అధిక ధరలు వంటి అనేక సమస్యలు వెంటాడుతూ ఉంటే అవేమీ పట్టకుండా మోడీ పాలన ఒక విధంగా ట్రంప్ పాలన ను తలపిస్తూదన్నారు.

## ఆస్పత్రి నిర్మాణానికి లోకేశ్ శంకుస్థాపన

మంగళగిరి: మంత్రి నారా లోకేశ్ మరో హామీని నిలబెట్టుకొన్నారు. పాదయాత్ర లో చెప్పినట్లుగా మంగళగిరి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఒక్కో హామీని నెరవేరుస్తున్నారని మంత్రిని అభినందించారు. చినకాకానిలో ఆయన ఆసుపత్రికి భూమి పూజ చేశారు. ఏడున్నర ఎకరాల్లో ఈ ఆసుపత్రిని నిర్మించ నున్నారు. అందుకోసం రూ. 52 కోట్లు ఖర్చు చేయనున్నారు. దేశంలోనే అత్యున్న స్థాయిలో ఈ ఆసుపత్రి ఉండాని లోకేశ్ ఆకాంక్షించారు. ఏడాదిలోపు ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తి కావాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రికి ధీటు–గా ఈ 100 పడకల ఆసుపత్రి ఉంటుందన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com